


బై..బై..గణేశా!

కొవ్వూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శనివారం వినాయక నిమజ్జనాలు చేశారు. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ పి. విశ్వం పట్టణ పోలీస్‌స్టేషన్ సిబ్బంది క్షేత్రంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రత నిర్వహించారు. క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఎదురుగా బారీ క్రేన్‌ను ఏర్పాటుచేసి ఉత్సవ విగ్రహాలను గజ ఈతగాళ్ల సహకారంతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత వినాయక విగ్రహాల నిమజ్జనాలను పర్యవేక్షించారు. రాజమహేంద్రవరంలోనూ నిమజ్జనాలు జరిగాయి.

వినాయక విగ్రహం రూ.2.39 లక్షలు



ఉండ్రాజవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల్లో లడ్డూ వేలం వేయడం చూస్తుంటాం..అయితే ఉండ్రాజవరం మండలంలోని చివటం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాన్ని వేలం వేస్తారు. ప్రతి ఏడాది ఇలాగే చేస్తారు. శుక్రవారం రాత్రి వేలం నిర్వహించగా హెచ్చుపాటగా రూ.2.39 లక్షలకు అదే గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీనివాస్ పాడారు. అదే మండపంలో ఏర్పాటు చేసిన అట్ల వినాయక విగ్రహాన్ని పాట వేయగా అదే గ్రామానికి చెందిన మోతే ఏసు రూ.25 వేలకు పాడారు. ప్రతి ఏటా మట్టి వినాయక విగ్రహాన్ని, అట్ల విగ్రహాన్ని పాటలు వేయడం జరుగుతుందని తెలిపారు. మట్టి విగ్రహాన్ని పాటపాడిని వారు తమ వ్యవసాయభూమిలో నిమజ్జనం చేస్తారని నిర్వాహకులు చెప్పారు.



గోదారికి వరద పోటు

కొవ్వూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పోటెత్తింది. మొదటి ప్రమాద హెచ్చరికను దాటి గోదావరి ప్రవహిస్తోంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చి ఉధృతంగా ప్రవహిస్తుంది. స్నానఘట్టాలపై ఉన్న శివలింగాలను ముంచెత్తి వరద ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దిశగా నీటిమట్టం నమోదైంది. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను విడుదల చేశారు. రాత్రి 10 గంటలకు 11.90 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. దిగువకు 10,06,819 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. భద్రాచలం నుంచి వరద ప్రవాహం ధవళేశ్వరం బ్యారేజ్ చేరుకోవడానికి 18 గంటల సమయం పడుతుంది. ఎగువన భద్రాచలం వద్ద మరింత వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గోదావరి కుడిగట్టు ఏఈ జి.మణికంఠరాజు మాట్లాడుతూ వరద ఉధృతిని ఎప్పటికప్పుడు అంచనావేస్తున్నామన్నారు. కొవ్వూరు, ప్రక్కిలంక, పోలవరం ఫ్లడ్‌స్టోర్‌లలో 400 క్యూబిక్ మీటర్ల ఇసుక, 1000 వెదురుకర్రలు,1000 సర్వేబాదులు సిద్ధం చేశామన్నారు.గోదావరి కుడిగట్టు పరిధిలోని ఏటిగట్లు ఎప్పటికప్పుడు పరిశీలించి నివేదిక ఇస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తున్నామన్నారు.



వృద్ధురాలికి ఆస్తి పత్రాలు అందజేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

కుమారుడు మోసగిస్తే.. అధికారులు ఆదుకున్నారు

గిఫ్ట్ డీడ్ రద్దు చేస్తూ ఉత్తర్వులు

రాజమహేంద్రవరం అర్బన్/గోకవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ చొరవతో ఒక వృద్ధురాలికి న్యాయం జరిగింది.గోకవరం మండలం అచ్చయ్యపేట గ్రామానికి చెందిన రొబ్బి వెంకట సత్యవతికి ముగ్గురు కుమారులు. ఇద్దరు కుమారులు వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. చిన్న కుమారుడు స్వగ్రామంలో ఉంటున్నాడు.ఇదిలా ఉండగా ఆమెకు వారసత్వంగా వచ్చిన ఇంటిని మూడో కుమారుడు లక్ష్మీ మధుసూదనరావు మోసపూరితంగా దాన సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. సీనియర్ సిటిజన్ యాక్టు - 2007 ప్రకారం విచారణ జరిపి ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్ దాఖలైనా కలెక్టర్ తిరస్కరించా రు. కోరుకొండ రిజిస్ట్రార్ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి ఆస్తిని తిరిగి సత్యవతి పేరున రిజిస్టర్ చేశారు. గతంలో విధించిన క్రయవిక్రయాల నిషేధాన్ని ఎత్తివేసి భవిష్యత్తులో ఆస్తిపై లావాదేవీలకు అనుమతించినట్లు ఆర్డీఓ పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరం ఆర్డీఓ కార్యాలయంలో సంబంధిత పత్రాలను వృద్ధురాలు వెంకట సత్యవతి (72)కు అందజేశారు. ఆస్తి వివాదం పరిష్కారమైందని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు.

ఆదివారం ప్రత్యేకం



పాపికొండలకు హెలీ టూరిజం

- టెండర్లు ఆహ్వానించిన ఏపీటీడీసీ
- హెలీకాప్టర్ నుంచి గోదావరి వీక్షణ
- రాజమండ్రి టూ పాపికొండలు
- బోట్లో వెళ్లి రావాలంటే పది గంటలు
- విమానంలో అయితే అరగంటే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చుట్టూ పచ్చని కొండలు.. ఆ కొండల మధ్య నుంచి వయ్యారాలు పోతూ సాగిపోయే గోదావరి.. మధ్యలో ఇసుక తిన్నెలు.. ఆ పక్కనే ప్రకృతి ప్రేమికుల మనసు దోచే అడవులు..ఇలా ఒకటేంటి పాపికొండల నడుమ గోదావరి అందాల గురించి వర్ణించాలంటే మాటలు చాలవు. అయితే వీటిని ఇప్పటి వరకు బోట్ల ద్వారా మాత్రమే వీక్షించి తన్మయం పొందే పర్యాటకులకు త్వరలో ఆకాశం నుంచి సైతం చూసే వీలుగా పర్యాటకశాఖ సన్నాహాలు చేస్తోంది. హెలీ టూరిజంలో భాగంగా హెలీకాప్టర్‌లో పర్యాటకులను తీసుకెళ్లి తీసుకువచ్చేలా కొత్తగా ప్రతిపాదనలు తయారుచేసింది. ఈ మేరకు హెలీటూరిజం.. జాయ్ రైడ్ పేరుతో టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థలు రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు హెలీకాప్టర్‌లో పర్యాటకులను తీసుకెళ్లి తీసుకువచ్చేలా ముందుకు రావాలని కోరింది. ఇది గనుక నెరవేరితే త్వరలోనే పాపికొండలను ఎంచక్కా హెలీకాప్టర్ లో తక్కువ సమయంలో చుట్టి వచ్చేయవచ్చు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు వెళ్లి రావాలంటే పది గంటల వరకు సమయం పడుతోంది. కానీ అరగంట వ్యవధిలోనే ఇలా వెళ్లి వచ్చేయవచ్చు.

టెండర్లు ఆహ్వానం

రాజమహేంద్రవరం నుంచి పాపికొండల వరకు పర్యాటకుల రద్దీ ఆధారంగా హెలీకాప్టర్ సర్వీసును అందుబాటులో తేవాలని నిర్ణయించింది. తాజాగా హెలీటూరిజం కింద టెండర్లు పిలిచింది. సెప్టెంబరు నాలుగో తేదీలోగా తమ ఆసక్తిని వ్యక్తీకరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని ఏవియేషన్ కంపెనీలను కోరింది. పాపికొండలతోపాటు అరకులోనూ ఈ సేవలను ప్రారంభించాలని భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో ఈ సేవలను అధికారులు ప్రారంభించారు. పాపికొండలకు హెలీ టూరిజం సేవలు ప్రారంభిస్తే రద్దీ భారీగా ఉంటుందని ఇప్పటికే పర్యాటకశాఖ అంచనాకు వచ్చింది. ప్రస్తుతం బోట్లలో పాపికొండలకు వెళ్లి రావడానికి పది గంటల వరకు సమయం పడుతోంది. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులకు ఒక రోజు వృథా అవుతోంది. అంతే కాకుండా నీటిలో ప్రయాణం అంటే భయపడేవారు అధికం. గతంలో జరిగాన్ని ప్రమాదాన్ని తలచుకుని పాపికొండల ప్రయాణం మానుకున్నవారెందరో. హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తే అర గంటలోగా పాపికొండలు చుట్టి వచ్చేయవచ్చు. పాపికొండలకు బోట్లు ఆయా తరగతిని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.2,500 వరకు వసూలు చేస్తున్నాయి. హెలీకాప్టర్‌కు ఎంత వసూలు చేస్తారనేది ఎంపికైన కంపెనీతో చర్చించి నిర్ణయించనున్నారు. ఇదిలా ఉంటే 2027 జూలై నుంచి గోదావరి పుష్కరాలు మొదలుకానున్నాయి. దీనికి లక్షలాది మంది భక్తులు రానున్నారు. ఈలోగా హెలీ టూరిజం ప్రారంభించి ప్రాముఖ్యతను పెంచితే పుష్కరాలకు వచ్చే భక్తులు, పర్యాటకుల నుంచి హెలీ టూరిజానికి మరింత రద్దీ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎన్ని అందాలో...

గోదావరి.. పాపికొండలు.. ఈ రెండింటి నడుమ ప్రకృతి అందాలు అన్నీ ఇన్నీ కావు. ప్రకృతి ప్రియుల మనసు దోచే సుందర దృశ్యాలెన్నో ఇక్కడ కనువిందు చేస్తాయి. అందుకే అనేక సంస్థలు గోదారి ఒడ్డున ఇసుక తిన్నెల్లో ప్రత్యేక గుడారాలు నిర్మించి మరీ గోదారి అందాలను అనుభవించేలా ప్యాకేజీలు వసూలు చేసి అలరిస్తున్నాయి. ఎండాకాలం, శీతాకాలంలో అయితే గోదావరి అందాలను వర్ణించడానికి మాటలు చాలవు. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు అయితే రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు బోటు షికారు ఎప్పటికీ మర్చిపోలేరు. ఇప్పుడు ఈ అందాలను బోట్ల ద్వారానే కాకుండా ఆకాశమార్గాన కూడా హెలీకాప్టర్‌లో చూపించేందుకు పర్యాటకశాఖ సిద్ధమవుతోంది. పర్యాటకులను అలరించేందుకు పర్యాటక శాఖ ఈ మార్గంలో హెలీకాప్టర్‌ను నడిపాలని భావిస్తోంది. తద్వారా మరింత మంది టూరిస్టులను ఆకట్టుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.


బార్లకు లాటరీ తీసిన ఆర్డీవో కృష్ణనాయక్

43 దరఖాస్తులు.. 9 బార్లు కేటాయింపు

అరగంటలో ముగిసిన బార్‌ల లాటరీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ కోలాహలంగా జరిగే బార్‌ల కేటాయింపు ఇప్పుడు పేలవంగా జరిగింది. అరగంటలో లాటరీ ప్రక్రియ ముగిసింది. తూర్పుగోదావరి జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 22, కల్లుగీత కార్మికుల కేటగిరీలో నిడదవోలు, రాజమండ్రి, కొవ్వూరు ఒక్కోటి చొప్పున బార్‌లను కేటాయించారు. ఓపెన్‌లో 6 బార్‌లకు 24 దరఖాస్తులు, కల్లుగీత కార్మికుల కేటగిరీకి 19 దరఖాస్తులు వచ్చాయి. బార్‌ల కేటాయింపునకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కృష్ణ నాయక్ లాటరీ తీశారు. కల్లుగీత కార్మికుల కేటగిరీలో రాజమండ్రికి 6, నిడదవోలులోని బార్‌కి 9 దరఖాస్తులు వచ్చాయి. కొవ్వూరు బార్‌కి ఒక్కటే దరఖాస్తు రావడంతో వారినే ఎంపిక చేశారు. కల్లుగీత కార్మికులకు వార్షిక రుసుంలో సగం రాయితీ ఉండడంతో దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ కేటగిరీలో మాత్రం 6 బార్‌లకు నాలుగు చొప్పున 24 దరఖాస్తులు వచ్చాయి. ఇవి కూడా అధికారుల ఒత్తిడితో సమర్పించామని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో ఒకటో తేదీ(రేపటి) నుంచి రాజమండ్రిలో 7, నిడదవోలు, కొవ్వూరులో ఒక్కోటి చొప్పున మొత్తం 9 బార్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇప్పటి వరకూ 20 వరకూ బార్‌లు ఉన్నాయి. దరఖాస్తులు రాకుండా ఉన్న బార్‌లకు ప్రభుత్వం మళ్లీ దరఖాస్తుకు గడువు ఇచ్చే అవకాశం ఉంది.

స్మార్ట్ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యం.. ఇద్దరిపై చర్యలకు కలెక్టర్‌కు సిఫారసు

గోపాలపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్మార్ట్ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వేళ్లచింతలగూడెం వీఆర్వో కాంతారావును సస్పెన్షన్ చేయుటకు కలెక్టర్‌కు సిపారసు లేఖ పంపినట్లు తహశీల్దార్ సాయిప్రసాద్ శనివారం సాయంత్రం తెలిపారు. స్మార్ట్‌కార్డులు పంపిణీ చేసే ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం వీఆర్వో కాంతారావు, 35 రేషన్ షాపు నిర్వాహకుడు గ్రామంలో టాంటాం వేయించినట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాల్సిన స్మార్ట్ కార్డులను ఒక ప్రదేశానికి వచ్చి తీసుకోవాల్సిందిగా కార్డుదారులకు సూచించా రన్నారు. గ్రామంలోకి విచారణకు వెళ్లగా స్మార్ట్‌కార్డులు తీసుకునేందుకు గ్రామానికి చెందిన కొరపాటి వెంకటస్వామి(69) స్మార్ట్‌కార్డు తీసుకునేందుకు వస్తుండగా మార్గమధ్యలో అస్వస్థతకు గురయ్యాడు.స్థానికులు ఇంటికి తరలించగా వెంకటస్వామి మృతిచెందినట్లు విచారణలో తేలిందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని భావించి ఇరువురిపై తగు చర్యలకు కలెక్టర్ సిపారసు లేఖ పంపినట్లు చెప్పారు.

ఆర్‌టీఐహెచ్ విభాగాల అధ్యక్షుల ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ విభాగాల అధ్యక్షుల ఎంపిక ఇంటర్వ్యూ పూర్తిచేసినట్టు ఈఆర్‌టీఐహెచ్ డైరెక్టర్, జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు. బొమ్మూరు ఆర్‌టీఐ హెచ్ భవనంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు జేసీ వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూలను కలెక్టర్ ప్రశాంతి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో ప్యానల్ సభ్యులు జేసీ చిన్నరాముడు, గ్రీన్ కో సీఎస్‌వో పి.రాంబాబు, నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ అండ్ ప్రొఫెసర్ కేవీ స్వామి, కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఏ.గోపాలకృష్ణ, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి శ్రీఫణిధర్ రామన్, ఇండస్ట్రియల్ ప్రమోషన్స్ అధికారి టీవి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ సలహాదారు షరీఫ్ రాక

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్ సెప్టెంబరు 1న రాజమహేంద్రవరం పర్యటనకు వస్తున్నారు.ఆదివారం రాత్రి 9 గంటలకు హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి సోమవారం 1న తెల్లవారుజామున 4:40 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుని అతిథి గృహంలో బస చేస్తారు.ఉదయం 10:15 గంటలకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అప్పర్ ప్రైమరీ మునిసిపల్ స్కూల్ సందర్శిస్తారు. 11:30 గంటలకు కొంతమూరు సమీపంలోజడ్పీ హైస్కూల్ సందర్శిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కలెక్టర్ ప్రశాంతితో సమావేశం అవుతారు.సాయంత్రం 5:30 గంటలకు రోడ్డుమార్గంలో నరసాపురం బయలుదేరి వెళతారు.

కోరుకొండలో యూరియాకు తోపులాట

కోరుకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియాకు రైతులు పోటీపడుతున్నారు. కోరుకొండలో శనివారం మధ్యాహ్నం యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున సొసైటీకి చేరుకుని ఒకరినొకరు తోసుకోవడంతో కోరుకొండ సొసైటీ కార్యాలయం ప్రధాన ముఖద్వారం అద్దాలు పగిలిపోయాయి. అద్దాలు గుచ్చుకుని కొంత మంది రైతులు గాయపడ్డారు. 10 గ్రామాల పరిధిలోని 5 వేల మంది రైతులకు కేవలం 10 టన్నుల యూరియా మాత్రమే కేటాయించారు. రైతులు తమకు యూరియా దొరకదేమోనన్న ఆత్రుతతో ఒకరినొకరు తోసుకున్నారు. సుమారు 200 మంది రైతులు ఒక్కసారిగా మేడపైకి వెళ్లి బయోమెట్రిక్ వేయాలన్న ఆత్రుతతో తోపులాటకు దిగారు. దీని మూలంగా కార్యాలయ అద్దాలు పగిలిపోయాయి.విషయం తెలుసుకున్న కోరుకొండ పోలీసులు హుటాహుటిన సొసైటీకి చేరుకుని రైతులను అదుపు చేశారు. పగిలిన అద్దాలు పరిశీలించి సొసైటీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సొసైటీ పరిధిలో ఉన్న 10 గ్రామాల్లో సుమారు 5 వేల మంది రైతులు ఉన్నారు. ఒకొక్కరికి రెండు బస్తాలు యూరియా ఇస్తామని.. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని చెప్పారు.అయితే సొసైటీకి వచ్చిన యూరియా 225 బస్తాలు మాత్రమే. 225 బస్తాల యూరియా 5 వేల మంది రైతులకు ఎలా సరిపెట్టాలో తెలియక సొసైటీ సిబ్బంది తలలు పట్టుకున్నారు. ముందుగా వెళ్లిన వారికి యూరియా దొరుకుతుందనే ఆత్రు తతో ఒకరినొకరిని నెట్టికుని ముందుకు వెళ్ళాలని బలప్రయోగానికి దిగారు.


సొసైటీలో రైతుల క్యూ, రైతుల తోపులాటలో బద్దలైన సొసైటీ మెయిన్‌డోర్

16 వేల ఎకరాల్లో నాట్లు

ఈ ఖరీఫ్ సీజన్‌లో కోరుకొండ మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. వ్యవవసాయాధికారుల లెక్కల ప్రకారం 35 వేల బస్తాల యూరియా అవసరం ఉంది. కోరుకొండ మండలంలో కోరుకొండ, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, దోసకాయలపల్లి, గాడాలలో సొసైటీలకు ఇప్పటి వరకు వచ్చిన ఎరువులు 300 మెట్రిక్ టన్నులు కూడా లేదు. జిల్లా వ్యాప్తంగా లెక్కలు పరిశీలిస్తే యూరియా ఇంచుమించుగా ప్రభుత్వం సరఫరా చేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడ రైతులు యూరియా అందక ఆందోళన చెందుతున్నారు. ఎరువులను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ సక్రమంగా కేటాయింపులు చేయకపోవడం వల్ల ఒక ప్రాంతానికి ఎక్కువ యూరియా వెళ్లిపోవడం, మరో ప్రాంతానికి తక్కువ రావడంతో రైతులు యుద్ధం చేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు . కలెక్టర్, జిల్లా విజిలెన్స్ అధికారులు చొరవ తీసుకుని జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి వాటి పరిధిలో ఎంత మంది రైతులు ఉన్నారో ఎంత వ్యవసాయ భూమి ఉన్నది పరిశీలిస్తే యూరియా ఎలాట్‌మెంట్‌లో తేడాలు బయట పడతాయి. అధిక మొత్తంలో కేటాయించిన యూరియాను బయటకు తీస్తే అందరికీ సక్రమంగా యూరియా అందుతుందని సొసైటీల పాలక వర్గాలు, రైతులు, సీఈవోలు చెబుతున్నారు.

కోరుకొండకు 1285.39 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చాం


రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కోరుకొండ సొసైటీకి శుక్రవారం 10.125 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఇప్పటి వరకూ ఆ సొసైటీకి మొత్తం 70.875 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, ఇది గతం కంటే రెట్టింపు అన్నారు గతేడాది 40.500 మెట్రిక్ టన్నుల మాత్రమే ఇచ్చినట్లు చెప్పా రు. ఆదివారం మరో 20 మెట్రిక్ టన్నులు యూరియా పంపిస్తున్నామన్నారు. కోరుకొండ మండలానికి ఇప్పటి వరకూ మొత్తం 1285.39 మెట్రిక్ టన్నులు పంపామని, వాస్తవానికి సెప్టెంబర్ నెల వరకూ 1342 టన్నుల యూరియా అవసరం ఉంటుందన్నారు.యూరియా కొరత అనేది నిజం కాదని ఆయన స్పష్టం చేశారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాక


మాట్లాడుతున్న పిక్కి నాగేంద్ర తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సారథ్యం యాత్రలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సెప్టెంబరు 1వ తేదీ సోమవారం రాజమహేంద్రవరం వస్తున్నారని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి ఉదయం పది గంటలకు యాత్ర ప్రారంభమై దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్యమైదానం వరకూ సాగుతుందని, అనంతరం సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొంటారని తెలిపారు. బీజేపీ ఆంధ్ర రాష్ట్రంలోనూ బలోపేతం కావాలని, దీనికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త దీక్షతో పనిచేయాలన్నారు. సారథ్యం కార్యక్రమాన్ని జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.







జై..జై గణేశా

ధవళేశ్వరం రథం వీధిలో కాణిపాకం వినాయకుడి ఆకారంతో నీటిలో ఏర్పాటు చేసిన 10 అడుగుల గణనాథుడి విగ్రహం | సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీనివాసుడి ఆకారంలో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణపతి | మండపేటలో కొలువైన త్రిముఖ గణనాథుడు | ధవళేశ్వరం పెన్నింటి వారి వీధిలో శనివారం రాత్రి సరస్వతి పూజ చేసి.. గణపతికి వేడుకుంటున్న చిన్నారులు | బిక్కవోలుకు శనివారం భక్తజనం పోటెత్తారు.. 1100 ఏళ్ల కిందటి భారీ గణనాథుడి చెవిలో కోర్కెలు చెప్పి తీర్చమని వేడుకున్నారు.

ఆర్టీషీ..ఛాన్స్!

ఆర్టీసీ ప్రగతి రథ సారథులుగా అతివలు

అమ్మాయిలకో అవకాశం..ఆర్టీసీలో అన్ని విభాగాల్లోనూ మహిళలు ఉన్నారు.. ఒక్క డ్రైవింగ్ విభాగంలో తప్ప.. ప్రస్తుతం ఆ విభాగంలోనూ యువతులకు అవకాశం ఇవ్వనున్నారు.. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాకు ఐదుగురికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.. ఆ లెక్కన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 మందికి అవకాశం దక్కనుంది. ఇంకెందుకు ఆలస్యం ఆర్టీసీ శిక్షణ తీసుకోండి.. మీరూ డ్రైవర్లుగా మారిపోండి..

- 15 మంది యువతులకు అవకాశం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉచిత శిక్షణ

అమలాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పురుషులతో సమానంగా మహిళలు కండక్టర్లుగా పనిచేస్తున్నారు. త్వరలో పురుషులకు సమానంగా మహిళా డ్రైవర్లు రానున్నారు. ఈ మేరకు తొలుత ఎస్సీ కార్పొరేషన్ ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్టీసీ సంస్థ నిర్వహించే డ్రైవింగ్ స్కూల్స్‌లో జిల్లాల వారీగా మగువలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎస్సీ అభ్యర్థులకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. తొలి విడతలో జిల్లాలో షెడ్యూల్డు కులాలకు చెందిన ఐదుగురు పురుషులతో పాటు తొలిసారిగా ఐదుగురు మహిళలకు హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ అందిస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి తెలిపారు. ఆసక్తి గల పురుష అభ్యర్థులతో పాటు స్త్రీలు సైతం సెప్టెంబరు 5వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

శిక్షణకు నిబంధనలు ఇలా..

ఆర్టీసీ సిబ్బంది హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తారు. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. అభ్యర్థులు విధిగా లైట్ మోటారు వెహికల్ లైసెన్స్ తీసుకుని ఏడాది పూర్తయి ఉండాలి. హెవీ డ్రైవింగ్ లెర్నర్ లైసెన్స్ కలిగి ఉండాలి. కనీస వయసు 20 ఏళ్లుగా నిర్ధారించారు. పురుష అభ్యర్థులతో సమానంగా ఆయా ఆర్టీసీ డిపోలోని డ్రైవింగ్ కళాశాలలోనే మహిళా అభ్యర్థులు శిక్షణ పొందాలి. 40 రోజుల శిక్షణలో థియరీతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. మహిళా అభ్యర్థులు ఖాకీ ప్యాంటు, షర్టు ధరించాలి. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆర్టీసీ సంస్థ సర్టిఫికెట్లు అందజేస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఆర్టీసీ సంస్థ డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. నోటిఫికేషన్ వచ్చే వరకు ఆర్టీసీలో రోజువారీ వేతనం విధానంలో పనిచేయడానికి సైతం అవకాశం ఉంటుంది.



దరఖాస్తులు ఇలా...

కార్పొరేషన్ (కాకినాడ)/ ముమ్మిడివరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జిల్లాకు ఐదుగురు పురుషులు, ఐదుగురు స్త్రీలకు మొత్తం 30 మం దికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (హెచ్ఎంవీ) ఉచిత శిక్షణ నిమిత్తం సెప్టెంబర్ 5వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత తెలి పే జిరాక్స్, ఆధార్ కార్డు, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్ఎంవీ) లైసెన్స్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్టీసీ నిబంధనలకు అంగీకారం, కులధ్రువీకరణ పత్రం దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా జతపరచాలన్నారు. కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డుకులాల సహకార సంఘం లిమిటెడ్, ప్రగతి భవన్ కాకినాడకు సెప్టెంబరు 5వ తేదీ 5 గంటలలోపు స్వయంగా గానీ, పోస్టల్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.సుధారాణి,సెల్ 93989 07208, 62818 17023 సంప్రదించాలన్నారు.

గోదావరి ప్రవహిస్తున్నంత కాలం

ఎస్పీబీ పాట వినిపిస్తూనే ఉంటుంది

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి
- ఎస్పీ శైలజ, సుధాకర్ దంపతులతో కలిసి ధవళేశ్వరంలో విగ్రహావిష్కరణ

ధవళేశ్వరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవహిస్తున్నంతకాలం ఎస్పీబాలసుబ్రహ్మణ్యం పాట ప్రపంచమంతా వినిపిస్తూనే ఉంటుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ ఎదురుగా ఉన్న పార్కులో గాన గంధర్వుడు ఎస్పీబీ నిలువెత్తు విగ్రహాన్ని గాయని ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్‌తో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల శనివారం ఆవిష్కరించారు. ఇదే పార్కులో ఘంటసాల విగ్రహాన్ని గతంలో ఎస్పీబీ ఆవిష్కరించడం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విగ్రహావిష్కరణలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా పేర్కొంటూ త్వరలో రాజమహేంద్రవరంలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పుతామని ప్రకటించారు. ఈ సందర్భంగా శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ మాట్లాడుతూ గోదావరి తీరాన ఆయన విగ్రహావిష్కరణ ఇంత ఘనంగా జరగడం ఆనందంగా ఉందన్నారు. ఘంటసాల విగ్రహానికి నివాళులర్పించారు. అంతకుముందు వీరికి సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్, రాకా రమణ, డాక్టర్ కంటే వీరన్నచౌదరి, యర్రమోతుధర్మరాజు,తిరుమల కృష్ణమోహన్, గ్రంథి జగన్నాథం, ఏడుకొండలు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, సీసీసీ ఛానల్ ఎండీ కొండలరావు, విగ్రహదాతగాలి సుబ్బరాజు మాట్లాడారు.రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు గౌరీశంకర్, తాతారావు, రామరాజు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న గోరంట్ల

ఎస్పీ బాలు స్మరణ సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో శనివారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంస్మరణార్థం సంగీత విభావరి జరిగింది. ముందుగా రాజమహేంద్రవరం డాక్టర్స్ కిడ్స్ సమర్పించిన బాలరామాయణం ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. శుభలేఖ సుధాకర్, ఎస్పీ శైలజ దంపతులు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఉండవల్లి అరుణ్‌కుమార్, అల్లు బాబీ, గాలి సుబ్బరాజు, వేగిశెట్టి కోదండరామయ్య, కంటే వీరన్నచౌదరి, రాకా అధ్యక్షుడు జీవీ రమణ, ఎస్పీ బాలు స్నేహితుడు జీవీ మురళి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎస్పీ బాలు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సంగీత విభావరిలో గాయకులు తమ పాటలతో అలరించారు.



ఆనం కళాకేంద్రంలో ఆకట్టుకున్న రాజమహేంద్రవరం డాక్టర్స్ కిడ్స్ బాలరామాయణం ప్రదర్శన



సంగీత విభావరిలో పాట పాడుతున్న ఎస్పీ శైలజ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక నేడు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మండపేటలో జిల్లా టెన్నికాయిట్ అధ్యక్షురాలు అప్పసాని కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కోశాధికారి ఎస్ఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మూడు విభాగాలకు సంబంధించి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్ విభాగం క్రీడాకారులు 2011జనవరి1 తరువాత పుట్టి ఉండాలన్నారు. జూనియర్ విభాగం 2007 జనవరి 1 తరువాత పుట్టి ఉండాలన్నారు. స్త్రీ. పురుషులు విభాగం వయసుతో సంబంధం లేకపోయినా పాల్గొనే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్, ప్రోపెర్ యూనిఫామ్‌తో హాజరుకావాలన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారు సెప్టెంబర్ నెలలో మండపేటలో జరుగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ లో పాల్గొంటారని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కోశాధికారి రామారావు తెలిపారు. ప్రతిభను బట్టి అక్టోబర్ 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్ నోయిడాలో జరుగనున్న జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికవుతారని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. వివరాలకు 9705551345 ఈ నెంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

సామర్లకోట వీబీఆర్ఐ జేడీగా డాక్టర్ షానిలాకుమారి

సామర్లకోట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో వెటర్నరీ బయోలాజికల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రకాశంజిల్లా ఒంగోలు ఏడీడీఎల్ గా పనిచేస్తున్న డాక్టర్ షానిలాకుమారిని పదోన్నతిపై బదిలీచేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీవో ఆర్‌టీ నెంబరు 306 పేరిట ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఉత్తర్వుల ప్రకారం సోమవారం సామర్లకోట కు చేరుకుని వీబీఆర్ఐలో జేడీగా బాధ్యతలు స్వీకరించ నున్నారు. గత జూన్ నెల వరకూ జేడీగా పనిచేసిన డా క్టర్ రత్నకుమారి దీర్ఘకాలపు సెలవుపై వెళ్లడంతో వీబీఆర్ఐలో ఏడీగా వ్యవహరిస్తున్న డాక్టర్ శ్రీనివాసు ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు సోమవారం జేడీగా షానిలాకుమారి బాధ్యతలు స్వీకరించనున్నట్లు వీబీఆర్ఐ అధికారులు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

భక్తజన సంద్రం.. వెంకన్న క్షేత్రం

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఆదాయం రూ.67.48లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వా మివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు.భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్ర దర్శనలు నిర్వహించారు. ఆలయంలో వివిధ విభాగాలను ఉపకమిషనర్ పరిశీలించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.67.48లక్షలు లభించినట్లు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 8వేల మందికి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.2,36,023 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

ఆరుగురు ఎంపీడీవోలకు పదోన్నతులు

సామర్లకోట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో వివిధ మండ లాల్లో ఎంపీడీవోలుగా పనిచేస్తున్న ఆరుగురికి డీఎల్‌డీవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి, సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కేవీఎస్ ప్రసాదరావు అందించిన సమాచారంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో డీఎల్‌డీవోలుగా పదోన్నతులు పొందిన వారిలో పెద్దాపురం ఎంపీడీవో డి.శ్రీలలిత, కరప ఎంపీడీవో ఎం.అనుపమ, ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ, రావులపాలెం ఎంపీ డీవో ఈ.మోహనేశ్వరరావు, మారేడిమిల్లి ఎంపీడీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, గృహ నిర్మాణమంత్రివద్ద ఓఎస్‌డీగా పనిచేస్తున్న డాక్టర్ ఎన్.ప్రకాశరావులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 53మంది ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా పదోన్నతులు లభించినట్లు రాష్ట్ర నాయకులు ప్రసాదరావు తెలిపారు. వీరికి పదోన్నతులతో పోస్టింగ్‌లు ఎక్కడెక్కడ ఇచ్చేది మరో మూడు రోజులలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రానున్నట్లు తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి

- టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించిన వ్యవసాయశాఖ కమిషనర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 30(ఆంధ్ర జ్యోతి): కాకినాడజిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని రాష్ట్రవ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీ రావు ఆదేశించారు. శనివారం ఆయన జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. నెలరోజుల సమయంలో నిర్ధేశించిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయశాఖ పరిధిలో ఉన్న 2లక్షల 25వేల ఎకరాలతోపాటు ఉద్యానశాఖ పరిధిలో ఉన్న 75వేల ఎకరాల పంటపొలాలను ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే పంటల బీమా, రాయితీలు, నష్టపరిహారం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు పొందాలంటే ఈ-క్రాప్‌లో నమోదు తప్పకుండా చేయాలన్నారు. దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్, ఇతర వ్యవసాయశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం పాదగయ క్షేత్రంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ పూజలు

పిఠాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు సందర్శించారు. పట్టణంలోని పాదగయలో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. డిప్యూటీ స్పీకర్‌ను ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల ఫొటోలను అందజేశారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం కుక్కుటేశ్వరస్వామి, శక్తిపీఠాన్ని దర్శించుకున్నానని, ఇప్పుడు మరలా ఆభాగ్యం కలిగిందని తెలిపారు. అంతకుముందు పిఠాపురం పర్యటనకు వచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామకు ఘనస్వాగతం లభించింది. అనఘా దత్తక్షేత్రంలో టీడీపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్, కొరుప్రోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.



పాదగయ క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, గణపతి సచ్చిదానందస్వామిజీని దర్శించుకున్న దృశ్యం

ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తెలిపారు. క్షేత్రంలో ఉన్న మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ, చాతుర్మాస్యవ్రత దీక్షలో ఉన్న ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామిజీలను దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన నడుస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధాని వచ్చినా ఎంపీగా నా నియోజకవర్గానికి రాలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితిలేదన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు డిప్యూటీ స్పీకర్‌ను సత్కరించారు.



పిఠాపురంలో భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తున్న మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ

అహాన్ని వీడకుంటే పతనం తప్పదు

- మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ

పిఠాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మనిషి అహాన్ని వీడకుంటే పతనం తప్పదని, అహాన్ని వీడితే బ్రహ్మను చేరుకునేశక్తి మానవుడికే ఉందని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ నిర్వహిస్తున్న చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శనివారం భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. డబ్బుపై ఆశ వదులుకోవాలని, కుటుంబంపై ప్రేమ చూపాలన్నారు. లోకం మీద ఆశలతో ఆధ్యాత్మిక భావనను విడనాడుతున్నారని, ఇది మంచిది కాదన్నారు. ఈ భూమి మీద అన్ని జీవులు తలదించుకుని నడుస్తాయని మనిషి మాత్రమే తలెత్తుకుని నడుస్తాడని తెలిపారు. తాను ఎక్కడి నుంచి వచ్చాడో తెలుసుకునే శక్తి ఒక్క మానవుడికే ఉందని చెప్పారు. సాధన, తపస్సు ద్వారా మాత్రమే పరబ్రహ్మ స్థితికి చేరుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.

తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ 2025-28కి గాను ఎలెక్షన్ ఆఫీసర్‌గా రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా కె.ఎస్ శ్రీపతి, వైస్ ప్రెసిడెంట్‌గా సర్ఫరాజ్‌నవాజ్, సెక్రెటరీగా నక్కా వెంకటేష్ జాయింట్ సెక్రెటరీగా లలిత కుమార్, కోశాధికారిగా గరగా అప్పారావు, కౌన్సిలర్‌గా నిమ్మల సత్యానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సెక్రటరీ పి.సత్యనారాయణ, మాజీ రంజీ క్రీడాకారుడు అహ్మద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాదగయలో వ్యవసాయశాఖ కమిషనర్, కలెక్టర్ పూజలు



పిఠాపురం పాదగయ క్షేత్రంలో వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ ప్రశాంతిలకు స్వామి, అమ్మవార్ల ఫొటోను అందజేస్తున్న ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్

పిఠాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ ప్రశాంతిలు శనివారం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు, వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. కమిషనర్, కలెక్టర్‌లను పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహనశ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి ఉన్నారు.

మళ్లీ నిరాశేనా..?



- సెప్టెంబర్ రేషన్‌లోనూ కందిపప్పు లేనట్టే!
- పేదలు బయట కొనుక్కోవాల్సిందేనా?
- నోరుమెదపని పౌరసరఫరాలశాఖ అధికారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అవును! పేదోళ్లు.. అప్పు చేసి 'పప్పు' కూడు తినాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఆకాశ్నంటుతున్న కందిపప్పు ధరే దీనికి కారణమని తెలుస్తోంది. మరోవైపు రేషన్ దుకాణాల ద్వారా అందజేసే కందిపప్పు సెప్టెంబర్ నెలలోనైనా ఇస్తారా! లేదో! అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత ఐదు నెలలుగా కందిపప్పు చేతికి చిక్కడం లేదు.. నోటికి అందడం లేదని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో అరకొరగా అందిన కందిపప్పు కూటమి ప్రభుత్వంలో ఆచూకీ లేకుండా పోయిందంటున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పేదలకు నిత్యావసరాలైన బియ్యం, చక్కెర, పామాయిల్‌తో పాటు కందిపప్పును సబ్సిడీపై అందజేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 15వేల మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 6 లక్షల 54 వేల మంది రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి నెలకు 300 మెట్రిక్ టన్నులు కందిపప్పు కేటాయించాలి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3 లక్షల 75 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి 200 మెట్రిక్ టన్నులు, తూర్పుగోదావరి జిల్లాలో ఐదు లక్షల రేషన్ కార్డులుకు 300 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలి. మొత్తంగా మూడు జిల్లాలు కలిపి 800 మెట్రిక్ టన్నులను ప్రభుత్వం సరఫరా చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంతకాలం క్రమం తప్పకుండా కందిపప్పు అందించినా.. ఐదు నెలలుగా సరఫరా నిలిపివేసింది. అమరావతిలో కందిపప్పు టెండర్లు ఖరారు కాకపోవడం వల్లే సరఫరా నిలిచిపోయిందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు ధర కిలో రూ.120 నుంచి రూ.140 మధ్యలో ఉంది. రేషన్ కార్డుదారులకు సబ్సిడీపై కిలో కందిపప్పు రూ.67కే అందించాలి. ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో హోల్‌సేల్‌గా కొంటే కిలో రూ.వందకు లభించే అవకాశం ఉంది. రేషన్ డీలర్లు ప్రతి నెలా 20వ తేదీలోపు డీడీలు తీసి, తమ పరిధిలోని కార్డుదారులకు అవసరమైన బియ్యం, కందిపప్పు, పంచదార తదితర సరుకులు దిగుమతి చేసుకుంటారు. కొన్ని నెలలుగా డీలర్లు డీడీలు తీస్తున్నా పౌరసరఫరాల శాఖ మాత్రం అవసరమైన మేరకు కందిపప్పు సరఫరా చేయడం లేదు. ఇక జిల్లాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం ఏ ఒక్క ఎంఎల్ఎస్ పాయింట్‌లోనూ కందిపప్పు నిల్వలు లేవు. రేషన్‌షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్లలో కందిపప్పు నిల్వలు నిండుకోవడంతో కార్డుదారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక నెల కందిపప్పు ఇస్తే రెండు నెలలు కోత విధించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్రమం తప్పకుండా పంపిణీ చేసినా.. ఐదు నెలలుగా సరఫరా కావడం లేదు. అయితే సెప్టెంబర్ నెలలో కూడా కందిపప్పు సరఫరాకు సంబంధించి ఎటువంటి కేటాయింపులు లేవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు రేషన్ డీలర్లను కూడా కందిపప్పునకు సంబంధించి డీడీలు తీయాలని ఈ నెల కూడా సమాచారం రాకపోవడంతో సెప్టెంబర్ నెలలోనూ కందిపప్పు లేనట్టేనని తెలుస్తోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..
కార్పొరేషన్ డైరెక్టర్లుగా పలువురికి అవకాశం



పిఠాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోగా అందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లానుంచి పలువురికి అవకాశం లభించింది. ఏపీస్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారటీ డైరెక్టర్‌గా పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలం అమీనాబాదుకు చెందిన వంకా కొం డబాబును నియమించారు. ఈయన జనసేన పార్టీకి చెందినవారు. ఆయనతోపాటు డైరెక్టర్లుగా టీడీపీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం నియోజకవర్గానికి చెందిన దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన విత్తనాల నాగశ్రీనివాస్ నియమితులయ్యారు. ఏపీ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్‌గా జనసేన పార్టీ నుంచి కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన శిరంగు శ్రీనివాసరావు, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కొమాముల తిరుమలకుమార్ (టీడీపీ) నియమితులుగా కాగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన సలాది పట్టాభిరామయ్య (టీడీపీ), తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గానికి చెందిన కూచిపూడి ఉదయభాస్కర్ (టీడీపీ) నియమితులయ్యారు.

క్రమంగా పెరుగుతున్న శబరి

- లోతట్టు ప్రాంతాల్లో చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ పర్యటన



నాటు పడవపై ప్రయాణిస్తున్న పీవో శుభం నొఖ్వాల్

చింతూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శబరి నదికి మళ్లీ వరద పెరుగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి చింతూరు వద్ద నీటిమట్టం 28 అడుగుల మేర ప్రవహించగా, శనివారం సాయంత్రం తిరిగి 33 అడుగులకు చేరుకుంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే భద్రాచలం వద్ద 47.6 అడుగుల మేర గోదావరి ప్రవహిస్తోంది. అక్కడ గంటకు అంగుళం మేర ఉధృతి పెరుగుతోంది. కూనవరం వద్ద గోదావరి శబరికి ఎగపోటు నివ్వడంతో శబరి తిరిగి పెరగడం మొదలైంది. దీంతో ఒడిశా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలన్నీ హుటాహుటిన లోతట్టు ప్రాంతాన్ని దాటించి గమ్యస్థానానికి పయనమయ్యాయి. ఇక జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల ప్రజల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ శనివారం నాటు పడవపై సోకిలేరు దాటి ఏజీ కొడేరు వెళ్లి అక్కడ పరిస్థితిని పరిశీలించారు.

మోతుగూడెం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో క్రమంగా నీటినిల్వలు పెరుగుతున్నాయి. బలిమెల జలాశయం దిగువన ఉన్న గుంటవాడ (సీలేరు), డొంకరాయి జలాశయాలకు కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బలిమెల జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1516 అడుగులు. ఇక్కడ 127.70 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు, ఎగువన ఉన్న జోలాపుట్ నుంచి పదివేల క్యూసెక్కుల చొప్పున నీటిని బలిమెలకు విడుదల చేస్తుండంతో పాటు నదీ పరీవాహక ప్రాంతాల వాగుల నుంచి కూడా మరో 11వేల క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో బలిమెలకు మొత్తం 21వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. దీంతో శనివారం నాటికి బలిమెలలో 1481.20 అడుగులకు నీటిమట్టం చేరింది. అలాగే డొంకరాయి జలాశయం 1032.10 అడుగులకు చేరింది. మరో 4.40 అడుగుల నీటిమట్టం పెరిగితే నీటిని దిగువకు విడుదల చేయాల్సి ఉంటుందని జెన్‌కో అధికారులు తెలిపారు.

ఈ-సేవతో కోర్టు సేవలు
మరింత సులభం

రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఈ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలు కోర్టు సేవలను మరింత సులభంగా పొందడానికి వీలు కలుగుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని తూర్పుగోదావరి జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ-సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా న్యాయవాదులు వారి వృత్తిలో సమర్థతను పెంపొందించుకోవచ్చన్నారు.

ఉరకలెత్తుతున్న గోదావరి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద రాత్రి 8.35 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 11.75 అడుగులకు చేరిన నీటి మట్టం
- 10,00,1410 క్యూసెక్కులు దిగువకు విడుదల
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- 48 అడుగుల దిశగా పెరుగుతూ 47.70 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతున్న నీటిమట్టం



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరంవద్ద గోదావరి ఉరలెత్తుతూ సముద్రం వైపు ప్రవహిస్తోంది. శనివారం తెల్లవారుజామున మూడుగంటల నుంచి క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం గంటలకు ఒక్క పాయింట్ చొప్పున పెరుగుదల నమోదు చేసుకుంటుంది. శనివారం ఉదయానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 7,62,218 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండగా రాత్రి 8.35 గంటలకు నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ శ్రీనివాసరావు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో 10,00,1410 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఇదే ఒరవడి కొనసాగితే ఆదివారం నాటికి మరో 2లక్షల క్యూసెక్కుల వరకు ప్రవాహం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలంవద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం శనివారం రాత్రి 7గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక చేరువలో 47.70 అడుగుల మధ్ద నిలకడగా కొనసాగుతోంది.

● ఎగువ నీటిమట్టాలు ఇవే..

రాత్రి ఏడు గంటల సమయానికి ఎగువున కాళేశ్వరంవద్ద నీటిమట్టం 12.510 మీటర్లుగా నమోదు కాగా పేరూరు వద్ద 16.760 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 12.900 మీటర్లు, భద్రాచలం వద్ద 47.70 అడుగులు, కూనవరం వద్ద 18.970 మీటర్లు, కుంట వద్ద 10.200 మీటర్లు, పోలవరం వద్ద 12.220 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.850 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

● 8 రోజుల వ్యవధిలో రెండోసారి..

గత ఎనిమిది రోజుల వ్యవధిలో గోదావరి ధవళేశ్వరం వద్ద ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించింది. ఈనెల 21వ తేదీ ఉదయం 6గంటలకు నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై 20 గంటల వ్యవధిలో నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ఆపై నీటిమట్టం తగ్గడంతో 23వతేదీ ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక, రాత్రి 2వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. వారం రోజులు నీటిమట్టం పెరుగుతూ.. తగ్గుతూ ప్రవహించి శనివారం రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరికకు చేరుకుంది.

తలకు గాయమై ఏడో తరగతి విద్యార్థిని మృతి



మృతి చెందిన దివ్యతేజ

- మారేడుమిల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘటన
- హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై బంధువులు, ఆదివాసీ సంఘాల ఆందోళన

మారేడుమిల్లి/రంపచోడవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని తలకు గాయమై శనివారం మృతి చెందింది. మండలంలోని చట్లవాడ పంచాయతీ గొందివాడ గ్రామానికి చెందిన చెదల ధర్మారెడ్డి, వెంకటలక్ష్మిల కుమార్తె దివ్యతేజ(11) మారేడుమిల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం వసతి గృహంలోని మరుగుదొడ్ల వద్ద కాలు జారి పడిపోవడంతో తలకు గాయమైంది. ఆ సమయంలో విద్యార్థినిని సిబ్బంది పట్టించుకోకపోవడంతో శనివారం ఉదయానికి అపస్మారక స్థితికి చేరుకుంది.తోటి విద్యార్థులు గమనించి సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆపై మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

చర్యలు చేపట్టే వరకూ పోస్టుమార్టం వద్దు

సమాచారం అందుకుని రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులకు పలు ఆదివాసీ, గిరిజన సంఘాలు బాసటగా నిలిచాయి. గాయపడిన బాలికను సిబ్బంది పట్టించుకోకపోవడంతో సకాలంలో వైద్యం అందక తమ కుమార్తె మృతిచెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసులు చెప్పగా విద్యార్థిని మృతికి కారణమైన అందరిపై చర్యలు తీసుకునే వరకూ పోస్టుమార్టం జరగనివ్వబోమని బాధిత బంధువులు, ఆదివాసీ నాయకులు ఆందోళనకు దిగారు. డీఎస్పీ ప్రశాంతకుమార్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. అనంతరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం చేరుకోగా ఆయన్ను ముట్టడించి నిలదీశారు. దీంతో మారేడుమిల్లి ఆశ్రమ పాఠశాలలో ఏం జరిగిందో తెలుసుకుందామని పీవో చెప్పగా తామూ వస్తామని చెప్పి పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆందోళనకారుల డిమాండ్లకు పీవో అంగీకరించకపోవడంతో తిరిగి రంపచోడవరం చేరుకుని ఆందోళన చేపట్టారు. తదుపరి ఆందోళనకారులతో డీఎస్పీ చర్చలు జరపడం, డిమాండ్లకు ఐటీడీఏ అంగీకరించడంతో ఆందోళనను విరమించారు. అప్పటికే పొద్దుపోవడంతో శవపంచనామా, పోస్టుమార్టమ్‌లను ఆదివారం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కాగా విద్యార్థిని మృతిపై విచారణకు సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్ అధ్యక్షతన ఐదుగురు అధికారుల కమిటీని నియమించినట్టు పీవో ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని మృతికి కారణంగా వార్డెన్ ఎస్.సీతమ్మను సస్పెండ్ చేశారు. బాలిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు అంగీకరించి తక్షణ సాయంగా రూ.50 వేలు అందజేశారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.అలాగే విద్యాలయంలోని ప్రైవేటు నర్సును తొలగిస్తున్నట్టు పీవో తెలిపారు.

కళ్లలో కారం చల్లి..బంగారు నగలు చోరీ

ఐ.పోలవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇంట్లో టీవీ చూస్తున్న వృద్ధురాలి కంట్లో కారం చల్లి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలెంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. భర్త గాదిరాజు సత్యనారాయణరాజు గదిలో నిద్రిస్తుండగా, భార్య కృష్ణవేణి టీవీ చూస్తున్న సమయంలో కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసును దుండగులు దోచుకెళ్లారు. ఆ ఇంట్లో వృద్ధ దంపతులు మాత్రమే నివాసముంటున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు బైక్‌పై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్ఐ రవీంద్రబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పెద్దాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళుతున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన పెద్దాపురం మండలం ఉలిమేశ్వరం-చదలాడ రోడ్డులో శనివారం జరిగింది. కాండ్రకోట గ్రామానికి చెందిన ఒబిలిశెట్టి అమ్మలు తిరుపతి శృంగార వల్లభ స్వామి గుడికి వెళుతుండగా మార్గమధ్యలో ఓ దుండగుడు బెదిరించి మెడలో ఉన్న 4కాసుల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

150 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

మోతుగూడెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌కి వచ్చిన సమాచారం మేరకు మర్రిగూడెం శివారులో ఒడిస్సా రాష్ట్రానికి మూడు ప్లాస్టిక్ బస్తాలతో 150 కిలోల గంజాయిని తరలిస్తున్న వంతల బలరామును అదుపులోకి తీసుకున్నారు. వంతల బలరామును అరెస్ట్ చేశారు. సీఐ సీహెచ్ గోపాలకృష్ణ నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

జీవితాలను సోషల్ మీడియాలో పెట్టొద్దు



రాజమహేంద్రవరం సదస్సులో ప్రసంగిస్తున్న చైర్‌పర్సన్ శైలజ

- సురక్షితం మన చేతుల్లోనే..
- బాధ్యతనెరిగి నడుచుకోవాలి
- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

రాజమహేంద్రవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జీవితాలను తీసుకెళ్లి సోషల్ మీడియాలో పెట్టవద్దని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. మహిళల భద్రత, సంక్షేమం, హక్కులపై శనివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. జ్యోతి ప్రకాశనం అనంతరం ఆమె మాట్లాడుతూ సురక్షితం అనేది మన చేతుల్లోనే ఉందని, బాధ్యతనెరిగి నడుచుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల వల్ల ప్రేమలు, పెళ్లిళ్ల పెరిగాయని, అదే సమయంలో బాధితులుగా మారుతున్న మహిళల సంఖ్య కూడా పెరుగుతోందన్నారు. మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలపై మౌనంగా ఉండడం సరికాదన్నారు.రిపోర్టు చేయాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఒక లెక్చరర్ విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించడం ఎప్పటి నుంచో జరుగుతున్నా ఒక విద్యార్థిని ధైర్యంగా ముందుకొచ్చి చెప్పడం వల్ల అక్కడితో ఆ అమానుషాన్ని అపగలిగామన్నారు. స్నేహంగా ఉండడం తప్పుకాదని, అదే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం ముఖ్యమన్నారు. పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న చోట కచ్చితంగా అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఉండాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. పోష్ చట్టంపై కూడా అవగాహన ఉండాలన్నారు. శక్తి యాప్ ప్రతి వాళ్ల సెల్‌ఫోన్‌లో ఉండాలన్నారు. భద్రతాపరమైన సమస్య ఉంటే 181, 112కి కూడా కాల్ చేసి చెప్పవచ్చన్నారు. వన్‌స్టాప్ సెంటర్లలో బాధిత మహిళలకు వసతి కల్పించడంతోపాటు కౌన్సెలింగ్ చేస్తారన్నారు. ర్యాగింగ్, పోక్సో వంటి కేసుల్లో నిందితుల పేర్లను ఆయా విద్యా సంస్థల వద్ద ప్రదర్శించడం మంచి ఆలోచన అని కలెక్టర్ ప్రశాంతిని ప్రశంసించారు. కమిషన్ సభ్యురాలు జయశ్రీ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఫొటోలను మార్ఫింగ్ చేస్తున్న కేసులు పెరుగుతున్నాయని, ఇటీవల ఇలాంటి ఘటనలో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఏఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఏడు శక్తి టీంలు పనిచేస్తున్నాయన్నారు. కళాశాలలతోపాటు మహిళలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మఫ్టీలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. మహిళా పీఎస్ సీఐ మంగాదేవి, సైబర్ క్రైం ఎస్ఐ అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ ఏపీకే ఫైల్స్‌ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దన్నారు. స్టాప్ ఎన్‌సీసీఐ అనే వెబ్‌సైటు ద్వారా మార్ఫింగ్ ఫొటోలను తొలగించుకోవచ్చన్నారు. అనంతరం వివాహానికి ముందు కౌన్సెలింగ్ చేసే సెంటర్ల పోస్టర్‌ని చైర్‌పర్సన్ ఆవిష్కరించారు.

హోరాహోరీగా పవర్‌లిఫ్టింగ్ పోటీలు



అవార్డు అందుకుంటున్న శివకుమార్



అవార్డు అందుకుంటున్న అఖిల

- స్ట్రాంగ్ మెన్‌గా శివకుమార్
- ఉమెన్‌గా అఖిల
- మాస్టర్స్‌గా నాగేశ్వరరావు, అప్పన్న





అమలాపురం టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా బీవీవీ సత్యనారాయణ, ఎంవీ సముద్రం, వి.నరేష్, వి.గణేష్, డీఆర్కే నాగేశ్వరరావు, షేక్ వలీసాహెబ్, టి.జోసెఫ్‌లు వ్యవహరించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఫైనల్స్ విజేతలను కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా కాకినాడకు చెందిన కె.దుర్గాశివకుమార్, రన్నర్‌గా కాకినాడకు చెందిన కె.మోహన్‌లు నిలిచారు. స్ట్రాంగ్ ఉమెన్ విన్నర్‌గా రామచంద్రపురానికి చెందిన డి.అఖిలదేవి, రన్నర్‌గా అమలాపురానికి చెందిన వై.ఇందిర నిలిచారు. మాస్టర్స్ విభాగంలో స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామం), బి.అప్పన్న (అమలాపురం) టైటిల్స్‌ను దక్కించుకున్నారు. 66 కిలోల మహిళల విభాగంలో ఎస్.స్పందన (రాజోలు), 74కిలోల విభాగంలో పి.దీవెన (కాకినాడ), 83 కిలోల విభాగంలో డి.అఖిలదేవి (రామచంద్రపురం) విజేతలుగా నిలిచారు. సబ్‌జూనియర్స్ 53 కిలోల విభాగంలో పి.వీరేంద్ర (కాకినాడ), 59 కిలోల విభాగంలో జె.జితేంద్రదొర (అమలాపురం), 66 కిలోల విభాగంలో కె.సాయిమణికంత (కాకినాడ), 74 కిలోల విభాగంలో ఎంఎస్ విన్సెంట్ (జగ్గంపేట), 59కిలోల మెన్ విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం), 66 కిలోల కేటగిరిలో ఎం.రాహుల్‌బాబు (అమలాపురం), 74 కిలోల విభాగంలో కె.దుర్గాసాయి కుమార్ (కాకినాడ), 83 కిలోల కేటగిరిలో కె.మోహన్ (కాకినాడ), 93 కిలోల విభాగంలో కె.సుధీర్ (మలికిపురం), 105 కిలోల విభాగంలో బి.అనూష్‌బాబు (మురమళ్ల), మాస్టర్స్ 83 కిలోల విభాగంలో డి.నాగేశ్వరరావు, బి.అప్పన్నలు ప్రథమస్థానాలు సాధించి విజేతలుగా నిలిచినట్టు ప్రకటించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మోకా వెంకటసుబ్బారావు, కల్వకొలను బాబు, అడపా వెంకటసుబ్రహ్మణ్యం, ఆశెట్టి ఆదిబాబు, ముమ్మిడి ప్రతాప్‌కుమార్ షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.



నాగేశ్వరరావుకు మెమెంటో అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

శ్రీలక్ష్మీగణపతి ఆలయానికి పోటెత్తిన భక్తులు


బిక్కవోలులో లక్ష్మీగణపతి దర్శనానికి బారులు తీరిన భక్తులు

బిక్కవోలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయం చవితి ఉత్సవాలు నాలుగో రోజైన శనివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా భక్తులు బారులు దీరి స్వామిని దర్శించుకున్నారు. స్వామి చెవిలో కోర్కెలు చెప్పడానికి పోటీ పడ్డారు. స్వామి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి చెక్కా సత్యనారాయణ, వీర్రాఘవమ్మ పేరున చెక్కా వీరభద్రరావు రమాదేవి దంపతులు అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, సొసైటీ చైర్మన్ పాలచర్ల శివప్రసాదచౌదరి ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం రాత్రి రంగంపేట టీడీపీ నాయకుడు దేశిన సత్యనారాయణ 110 కిలోల లడ్డూను లక్ష్మీగణపతికి అందజేశారు. అలాగే ఆలయార్చకుడు గొల్లపల్లి చలపతి శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. కాగా స్వామి వారికి కాకినాడకు చెందిన నిమ్మల శివకుమార్ దంపతులు 4గ్రాముల బంగారు బిస్కెట్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ దంపతులను ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబా రెడ్డి, పల్లి వాసు సత్కరించారు.

మత్స్యకార కుటుంబాల సంక్షేమమే లక్ష్యం

మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పెద్దిరాజు

బిక్కవోలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి మత్స్యకార కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొల్లు పెద్దిరాజు తెలిపారు. శనివారం ఆయన బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. అనంతరం పెద్దిరాజు విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి మత్స్యకార గ్రామంలోను ఒక గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే మత్స్యకారులకు ఆదరణ పథకంలో ప్రాంతాన్ని బట్టి వలలు, తెప్పలు, మోపెడ్‌లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పెద్దిరాజు వెంట జంపా వెంకటరమణ, వైదాడి వెంకటేశ్వరరావు, బేరా అప్పారావు, కొల్లి గోపాలరావు ఉన్నారు.

39వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, సొంత నిదులు కేటాయింపులు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 39వ డివిజన్‌లో రూ.24 లక్షలతో చేపట్టిన పనులకు శనివారం టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి యాళ్ల ప్రదీప్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం లింగంపేట 5వ వీధిలో రోడ్డు లెవెలింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు తమకు ఇష్టమొచ్చినట్టు కాకుండా ప్రజలకు ఏది అవసరమో గుర్తించి ఆ మేరకు పనులు చేపడుతున్నామన్నారు. లింగంపేట వాంబే కాలనీలో అసంపూర్తిగా ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌ల పనులను పూర్తిచేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 39వ డివిజన్‌లో రూ.1.52 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీ నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, గొర్రెల సత్యరమణి, చాపల నాగమణి, తుళ్లిపద్మ, నాగలక్ష్మి, కరగాని వేణు, మళ్ల వెంకట్రాజు, దాస్యం ప్రసాద్, దుత్తకవు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వినియోగించుకోవాలి

బిక్కవోలు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. బలభద్రపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.ప్రభాకరరావు అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఎఫ్‌ఏ-1 పరీక్షలపై సమీక్ష, సబ్జెక్టులు వారీగా విద్యాశాఖ రూపొందించిన వెబ్ లింకుల ద్వారా శిక్షణా తరగతులను కాంప్లెక్స్ రీసోర్స్‌పర్సన్స్ శిక్షణ ఇచ్చారు. విద్యాశాఖ ద్వారా నిర్వహించే ఈసమావేశాల వల్ల విద్యా విధానంలో నూతన పోకడలు, గుణాత్మక మార్పులు తెల్సుకుని విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో వివరించారు. ఈ సమావేశానికి బలభద్రపురం, కాపవరం, పందలపాక గ్రామాల పాఠశాలల నుంచి 82 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమాదేవి ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.

అనపర్తి ఏఎంసీ యార్డ్ అసిస్టెంట్ పదవీ విరమణ


కాటంరాజును సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీను తదితరులు

అనపర్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అనపర్తి మార్కెట్ కమిటీ యార్డ్ అసిస్టెంట్ చాగంటి కాటంరాజు పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సభ శనివారం జరిగింది. ఏఎంసీలో 24 ఏళ్లుగా చిరుద్యోగిగా సేవలందించిన కాటంరాజును సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సేవా తత్పరతతో కూడిన సేవలందిస్తూ మార్కెట్ కమిటీ అనేది ఇంటి పేరుగా మార్చుకున్న కాటం రాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, చింతా ప్రకాశ రెడ్డి, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ మొదటి వారంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు

బిక్కవోలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలభద్రపురంలో క్యాన్సర్ భూతం పెల్లుబికిందన్న ఆందోళనల నేపథ్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కృషి ఫలించింది. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌ను కలిశారు. ఢిల్లీలో ఉన్న హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ, నారా బ్రాహ్మణిలతో ఫోన్‌లో ఆయన మాట్లాడడంతో అందుకు వారు వెంటనే స్పందించి సెప్టెంబర్ మొదటి వారంలో బలభద్రపురంలో మెడికల్ క్యాంపు నిర్వహించి అందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాలని, ఎవరికైనా రోగనిర్ధారణ జరిగితే హాస్పిటల్ తరపున ట్రీట్‌మెంట్ చేయాలని మేనేజ్‌మెంట్‌కు సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సినేషన్ బాగా ఖరీదుగా వుందని తెలపడంతో తక్కువ ధరకే సరఫరా చేస్తామన్నారని, అయితే తాను నియోజకవర్గానికి సరఫరా చేయాలని కోరానన్నారు.

బాలశంకర్‌కు డాక్టరేట్


బాలశంకర్‌కు డాక్టరేట్ అవార్డును అందజేస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్‌ఈ విభాగం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన ఉండవల్లి బాలశంకర్‌కు అవార్డు కాపీని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ శనివారం అందజేసి అభినందించారు. సోషియో-ఎకనామిక్ ప్యాటర్న్‌ను ఆవిష్కరించడం: ఎఫ్యూజన్ ఆఫ్ స్టాటిస్టికల్ అనాలిసిస్ అండ్ డీప్ మెషిన్ లెర్నింగ్ ఆన్ సెషన్ డేటా అనే అంశంపై బాలశంకర్ పరిశోధన చేశారని చెప్పారు. నన్నయ వర్సిటీ సీఎస్‌ఈ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య పి.సురేష్‌వర్మ మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. సామాజిక, ఆర్థిక నమూనాలను ఆవిష్కరించడం, సెషన్ డేటాపై గణాంక విశ్లేషణ లోతైన యంత్ర అభ్యాసం, కలయికకు సంబంధించిన పరిశోధన చేసిన బాలశంకర్ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వీసీ అభినందించారు.

స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

రంగంపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌ను సౌకర్యంగా, మరింత పాదర్శంగా, సులభతరం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ స్మార్ట్‌రైస్ కార్డులు అందజేస్తున్నామని టీడీపీ నాయకుడు పూసల శ్రీనివాస్ అన్నారు. శనివారం సుభద్రంపేటలో స్మార్ట్ కార్డులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ప్రతి కుటుంబంలో ఓ వ్యాపారవేత్త

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణ
సీవోలు, ఆర్పీలతో ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ వెంకట రమణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం నుంచి ఓ వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యం గా మెప్మా అడుగులు ముందుకు వేస్తున్నట్టు మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటరమణ అన్నారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివా రం సీవోలు, ఆర్పీలతో జరిగిన ప్రత్యే క సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉన్నతిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. మొబైల్ మార్టులు, ర్యాపిడో వెహికల్స్, తృప్తి క్యాంటీన్, టూరిజం సర్వీసెస్, అమృత మిత్ర వంటి స్పెషల్ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. అందుకు సంబంధించిన లక్ష్యాలను పూర్తిచేయాలని వెంకటరమణ సూచించారు. అలాగే పీఎం సూర్యఘర్ మంచి పథకమని, నగరంలో ప్రజలు విరివిగా వినియోగించుకొనేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం పీఎం సూర్యఘర్ పథకంపై ఎల్లిన్ సోలార్ ఎనర్జీ సంస్థ జోనల్ మేనేజరు రవిప్రకాష్ అవగాహన కల్పించారు. డీజీ లక్ష్మి పథకంపై పోస్టల్ డిపార్ట్మెంట్ సీనియర్ మేనేజరు రాజేంద్ర కొత్తగా ఎన్నుకున్న డీజీ లక్ష్మిలకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో టీఎంసీ సాయికుమార్, సాంకేతిక నిపుణులు ఫణికుమార్, శ్రీదేవి, కమ్యూనిటీ ఆర్గనైజన్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

నాలుగు గంటలు ట్రాఫిక్‌జామ్

» ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ
» దివాన్‌చెరువు హైవేపై ప్రమాదం
» కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
» వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు


హైవేపై నిలిచిపోయిన వాహనాలు, ప్రమాద దృశ్యం



దివాన్‌చెరువు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై దాదాపు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీనితో రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు ముందుకు కదిలేందుకు నానా అవస్థలు పడ్డాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ దివాన్‌చెరువు జంక్షన్ వద్దకు వచ్చేసరికి స్టీరింగ్‌లో సాంకేతిక లోపంతో రోడ్డుపైనే ఆగిపోయింది. అయితే వెనుక వస్తున్న మరో లారీ ఆగిపోయిన లోడ్ లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శనివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదం కారణంగా దివాన్‌చెరువు నుంచి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సమీపం వరకూ దాదాపు 5 కిలోమీటర్ల మేర రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలు బారులు దీరి నిలిచిపోయాయి. ముందుకు కదిలేందుకు నానా ఇబ్బందులు పడవలసి వచ్చింది. గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర వాహనాలకు సైతం ట్రాఫిక్ అవస్థలు తప్పలేదు. అలాగే పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయం కావడంతో ఈ రహదారి మీదుగా ప్రయాణించే వివిధ విద్యాసంస్థలకు చెందిన బస్సులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లు పడవలసి వచ్చింది. సమాచారం అందుకున్న బొమ్మూరు పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్ రోడ్డులోని ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో ఈ సంవత్సరం కొత్తగా బీఎస్సీ కోర్సులో ప్రస్తుతం ఉద్యోగావకాశాలు అధికంగా లభించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ కోర్సులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మంజూరు చేసిందని కరస్పాండెంట్ రమణయ్య తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశించడానికి ఇంటర్మీడియేట్ ఎంపీసీ గ్రూపు విద్యార్థులు అర్హులని, ఈ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కళాశాల పనివేళలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రిన్సిపాల్‌ని సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సంగీత పాఠశాలలో కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో కర్ణాటక సంగీతం, గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, కూచిపూడి నృత్య విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస శర్మ తెలిపారు. సర్టిఫికెట్ కోర్సులో చేరే వారికి 2025 జూలై 1వ తేదీ నాటికి 10 సంవత్సరాలు వయస్సు పైబడి ఉండాలి. డిప్లమో కోర్సులో చేరాలనుకునే వారు సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణులై ఉండి 1.7.2025 నాటికి 15 సంవత్సరాల వయస్సు పైబడిన వారు అర్హులని చెప్పారు. రూ.100 ఆలస్య రుసుముతో సెప్టెంబర్ 1 నుంచి 30వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇతర వివరాలను పాఠశాల కార్యాలయంలో గాని, 0883 2421669కు గాని ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విద్యార్థులకు అవగాహన సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న

రాజానగరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించడం, జరిపించడం చట్టరీత్యా నేరమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్న స్పష్టం చేశారు. బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు అవుట్ పోస్ట్ పరిధిలోని ఈఏఆర్ పాఠశాలలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రసన్న బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, అనర్థాలు, బాల్య వివాహ చట్టాన్ని వివరించారు. అలాగే సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, నేర్చుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్‌ఐలు నారాయణమ్మ, ప్రియకుమార్, కోర్టు కానిస్టేబుల్ ప్రసాద్, కొంతమూరు అవుట్ పోస్ట్ హెచ్‌సీ నరేష్ పాల్గొన్నారు.

జనార్దన స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ధవళేశ్వరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ధవళగిరిపై లక్ష్మీ జనార్దన స్వామి ఆలయ పాలక మండలి శనివారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా దాసరి చిన్న రమణ, సభ్యులుగా కరణం వెంకటలక్ష్మి, సూరాడ వేణి, రేలంగి నాగరత్నం, మానుపాటి సంధ్యారాణి, బి.లక్ష్మణ్, పట్నాల ముత్యాలరావు, పలివెల సురేష్, పరమళ్ల శివకృష్ణలతో ఆలయాధికారి సురేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. పాలక మండలిని నాయకులు పండూరి అప్పారావు, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు, అడపా శ్రీను, బత్తిన ఏడుకొండలు, నాళ్ల రమేష్, దాసరి సాగర్, బి.శ్రీను అభినందించారు.

కుటుంబ సభ్యుల ధ్రువీకరణకు తప్పుడు సమాచారం

తహశీల్దార్ ఫిర్యాదుతో వ్యక్తిపై కేసు

సీతానగరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోర్టు అనుమతితో ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన వేమగిరి నరసయ్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. 2020 సంవత్సరంలో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ కోసం నరసయ్య తప్పుడు సమాచారం ఇచ్చి సర్టిఫికెట్ తీసుకున్నారు. ఆ సర్టిఫికెట్ జారీ చేసిన తహశీల్దార్ మృతిచెందారు. అయితే నరసయ్యకు ఇద్దరు చెల్లెళ్లు (ఉందుర్తి పరంజ్యోతి, కొక్కిరిపాటి సుబ్బాయమ్మ) ఉన్నారు. తాను తప్ప వారసులు ఎవ్వరూ లేరని, తాను ఒక్కడే సంతానమని నమ్మించి నరసయ్య సర్టిఫికెట్ పొందారు. చెల్లెలి కుటుంబ సభ్యులు లోకాయుక్తను ఆశ్రయించగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించగా తప్పుడు సమాచారం ఇచ్చినట్టు విచారణలో గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కోర్టు అనుమతితో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

‘యూరియా కొరతతో రైతుల అవస్థలు’

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు యూరియా కొరతతో తీవ్ర అవస్థలు పడుతున్నారని, కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేపూడి జ్యోతి రాజు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎరువుల కోసం సొసైటీల వద్ద రైతు పడిగాపులు కాస్తుంటే, మరోపక్క అక్రమార్కులు ఎరువులను బ్లాక్ మార్కెట్లకు తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే ఎరువుల కొరత పరిష్కరించకపోతే ఆందోళనబాట పడతామని పేర్కొన్నారు.

బాలసదనం బాలికలకు ఆటల పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న రాజమహేంద్రవరంలోని బాలసదనంలోని బాలికలకు వివిధ రకాలైన ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం బాలసదనం, కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల ఆవరణలో మ్యూజికల్ చైర్, పరుగు, ఖోఖో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో బాలసదనం సూపరింటెండెంట్ జి.రోజారాణి, డీసీపీయూ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఏడుకొండలు

గోకవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీ జడ్పీటీసీ గులా ఏడుకొండలు నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందినట్టు ఏడుకొండలు స్థానిక విలేకరులకు తెలిపారు. గోకవరం మండలం ఇటికాయిలపల్లికి చెందిన ఏడుకొండలు గతంలో వీసీసీ అధికార ప్రతినిధిగా, జడ్పీటీసీగా, ఎంపీటీసీగా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. కాగా ఏడుకొండలు నియామకంపై పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు భూపతిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

గోకవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో ఈనెల 31న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పాఠశాల చైర్మన్ గళ్లా రాము శనివారం తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థులు అలూమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో దంత, నేత్ర, చర్మవ్యాధులతో పాటు 20 రకాల వైద్య సేవలు విద్యార్థులకు అందుతాయన్నారు.

రైట్ కళాశాలలో క్రీడా పోటీలు

దివాన్‌చెరువు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): క్రీడల వల్ల ఆరోగ్యంతో బాటు, క్రమశిక్షణ అలవడుతాయని రాజానగరం మండలం భూపాలపట్నంలోని రాజమహేంద్రి (రైట్) ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి , కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రైట్ కళాశాలలో విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. విభాగాధిపతి వై.విజయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోశాధికారి పి.రవికిరణ్, ప్రిన్సిపాల్ కె.భాస్కరముత్యాలు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట సొసైటీ సీఈవోకు ఘన వీడ్కోలు



రంగంపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రంగంపేట సొసైటీ సీఈవో బొడ్డు త్రిమూర్తులు ఉద్యోగ విరమణ సత్కార సభ సొసైటీ అధ్యక్షుడు గారపాటి రాంబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. సొసైటీ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారుల సమన్వయంతో సుమారు 42 సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించడం అభినందనీయమని టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ల గోవిందు అన్నారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు, మాళవిక దంపతులను సత్కరించారు. ఇన్‌చార్జి సీఈవోగా కాకర్ల రామకృష్ణకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బోడెం రాంబాబు,దూబాసి వరప్రసాద్, కూటమి నాయకులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.





బై..బై..గణేశా!

కొవ్వూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శనివారం వినాయక నిమజ్జనాలు చేశారు. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ పి. విశ్వం పట్టణ పోలీస్‌స్టేషన్ సిబ్బంది క్షేత్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత నిర్వహించారు. క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ఎదురుగా భారీ క్రేన్‌ను ఏర్పాటుచేసి ఉత్సవ విగ్రహాలను గజ ఈతగాళ్ల సహకారంతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత వినాయక విగ్రహాల నిమజ్జనాలను పర్యవేక్షించారు. రాజమహేంద్రవరంలోనూ నిమజ్జనాలు జరిగాయి.

వినాయక విగ్రహం రూ.2.39 లక్షలు



ఉండ్రాజవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల్లో లడ్డూ వేలం వేయడం చూస్తుంటాం..అయితే ఉండ్రాజవరం మండలంలోని చివటం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాన్ని వేలం వేస్తారు. ప్రతి ఏడాది ఇలాగే చేస్తారు. శుక్రవారం రాత్రి వేలం నిర్వహించగా హెచ్చుపాటగా రూ.2.39 లక్షలుకు అదే గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీనివాస్ పాడారు. అదే మండపంలో ఏర్పాటు చేసిన అట్ట వినాయక విగ్రహాన్ని పాట వేయగా అదే గ్రామానికి చెందిన మోతే ఏసు రూ.25 వేలకు పాడారు. ప్రతి ఏటా మట్టి వినాయక విగ్రహాన్ని, అట్ట విగ్రహాన్ని పాటలు వేయడం జరుగుతుందని తెలిపారు. మట్టి విగ్రహాన్ని పాటపాడిని వారు తమ వ్యవసాయభూమిలో నిమజ్జనం చేస్తారని నిర్వాహకులు చెప్పారు.


కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ఉధృతంగా వరద

గోదారికి వరద పోటు

కొవ్వూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పోటెత్తింది. మొదటి ప్రమాద హెచ్చరికను దాటి గోదావరి ప్రవహిస్తోంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చి ఉధృతంగా ప్రవహిస్తుంది. స్నానఘట్టాలపై ఉన్న శివలింగాలను ముంచెత్తి వరద ప్రవాహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దిశగా నీటిమట్టం నమోదైంది. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను విడుదల చేశారు. రాత్రి 10 గంటలకు 11.90 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. దిగువకు 10,06,819 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. భద్రాచలం నుంచి వరద ప్రవాహం ధవళేశ్వరం బ్యారేజ్ చేరుకోవడానికి 18 గంటల సమయం పడుతుంది. ఎగువన భద్రాచలం వద్ద మరింత వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గోదావరి కుడిగట్టు ఏఈ జి.మణికంఠరాజు మాట్లాడుతూ వరద ఉధృతిని ఎప్పటికప్పుడు అంచనావేస్తున్నామన్నారు. కొవ్వూరు, ప్రక్కిలంక, పోలవరం ఫ్లడ్‌స్టోర్‌లలో 400 క్యూబిక్ మీటర్ల ఇసుక, 1000 వెదురుకర్రలు,1000 సర్వేబాదులు సిద్ధం చేశామన్నారు.గోదావరి కుడిగట్టు పరిధిలోని ఏటిగట్లు ఎప్పటికప్పుడు పరిశీలించి నివేదిక ఇస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తున్నామన్నారు.


వృద్ధురాలికి ఆస్తి పత్రాలు అందజేస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

కుమారుడు మోసగిస్తే.. అధికారులు ఆదుకున్నారు

గిఫ్ట్ డీడ్ రద్దు చేస్తూ ఉత్తర్వులు

రాజమహేంద్రవరం అర్బన్/గోకవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ చొరవతో ఒక వృద్ధురాలికి న్యాయం జరిగింది.గోకవరం మండలం అచ్చయ్యపేట గ్రామానికి చెందిన రొబ్బి వెంకట సత్యవతికి ముగ్గురు కుమారులు. ఇద్దరు కుమారులు వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. చిన్న కుమారుడు స్వగ్రామంలో ఉంటున్నాడు.ఇదిలా ఉండగా ఆమెకు వారసత్వంగా వచ్చిన ఇంటిని మూడో కుమారుడు లక్ష్మీ మధుసూదనరావు మోసపూరితంగా దాన సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. సీనియర్ సిటిజన్ యాక్టు - 2007 ప్రకారం విచారణ జరిపి ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్ దాఖలైనా కలెక్టర్ తిరస్కరించా రు. కోరుకొండ రిజిస్ట్రార్ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి ఆస్తిని తిరిగి సత్యవతి పేరున రిజిస్టర్ చేశారు. గతంలో విధించిన క్రయవిక్రయాల నిషేధాన్ని ఎత్తివేసి భవిష్యత్తులో ఆస్తిపై లావాదేవీలకు అనుమతించినట్టు ఆర్డీఓ పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరం ఆర్డీఓ కార్యాలయంలో సంబంధిత పత్రాలను వృద్ధురాలు వెంకట సత్యవతి (72)కు అందజేశారు. ఆస్తి వివాదం పరిష్కారమైందని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు.

ఆదివారం ప్రత్యేకం



పాపికొండలకు హెలీ టూరిజం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చుట్టూ పచ్చని కొండలు.. ఆ కొండల మధ్య నుంచి వయ్యారాలు పోతూ సాగిపోయే గోదావరి.. మధ్యలో ఇసుక తిన్నెలు.. ఆ పక్కనే ప్రకృతి ప్రేమికుల మనసు దోచే అడవులు..ఇలా ఒకటేంటి పాపికొండల నడుమ గోదావరి అందాల గురించి వర్ణించాలంటే మాటలు చాలవు. అయితే వీటిని ఇప్పటి వరకు బోట్ల ద్వారా మాత్రమే వీక్షించి తన్మయం పొందే పర్యాటకులకు త్వరలో ఆకాశం నుంచి సైతం చూసే వీలుగా పర్యాటకశాఖ సన్నాహాలు చేస్తోంది. హెలీ టూరిజంలో భాగంగా హెలీకాప్టర్‌లో పర్యాటకులను తీసుకెళ్లి తీసుకువచ్చేలా కొత్తగా ప్రతిపాదనలు తయారుచేసింది. ఈ మేరకు హెలీటూరిజం.. జాయ్ రైడ్ పేరుతో టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థలు రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు హెలీకాప్టర్‌లో పర్యాటకులను తీసుకెళ్లి తీసుకువచ్చేలా ముందుకు రావాలని కోరింది. ఇది గనుక నెరవేరితే త్వరలోనే పాపికొండలను ఎంచక్కా హెలీకాప్టర్‌లో తక్కువ సమయంలో చుట్టి వచ్చేయవచ్చు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు వెళ్లి రావాలంటే పది గంటల వరకు సమయం పడుతోంది. కానీ అరగంట వ్యవధిలోనే ఇలా వెళ్లి వచ్చేయవచ్చు.

- టెండర్లు ఆహ్వానించిన ఏపీటీడీసీ
- హెలీకాప్టర్ నుంచి గోదావరి వీక్షణ
- రాజమండ్రి టూ పాపికొండలు
- బోట్లో వెళ్లి రావాలంటే పది గంటలు
- విమానంలో అయితే అరగంటే

టెండర్లు ఆహ్వానం

రాజమహేంద్రవరం నుంచి పాపికొండల వరకు పర్యాటకుల రద్దీ ఆధారంగా హెలీకాప్టర్ సర్వీసును అందుబాటులో తేవాలని నిర్ణయించింది. తాజాగా హెలీటూరిజం కింద టెండర్లు పిలిచింది. సెప్టెంబరు నాలుగో తేదీలోగా తమ ఆసక్తిని వ్యక్తీకరిస్తూ దరఖాస్తు చేసుకోవాలని ఏవియేషన్ కంపెనీలను కోరింది. పాపికొండలతోపాటు అరకులోనూ ఈ సేవలను ప్రారంభించాలని భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో ఈ సేవలను అధికారులు ప్రారంభించారు. పాపికొండలకు హెలీ టూరిజం సేవలు ప్రారంభిస్తే రద్దీ భారీగా ఉంటుందని ఇప్పటికే పర్యాటకశాఖ అంచనాకు వచ్చింది. ప్రస్తుతం బోట్లలో పాపికొండలకు వెళ్లి రావడానికి పది గంటల వరకు సమయం పడుతోంది. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులకు ఒక రోజు వృథా అవుతోంది. అంతేకాకుండా నీటిలో ప్రయాణం అంటే భయపడేవారు అధికం. గతంలో జరిగాన్ని ప్రమాదాన్ని తలచుకుని పాపికొండల ప్రయాణం మానుకున్నవారెందరో. హెలీ టూరిజం సేవలు అందుబాటులోకి వస్తే అర గంటలోగా పాపికొండలు చుట్టి వచ్చేయవచ్చు. పాపికొండలకు బోట్లు ఆయా తరగతిని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.2,500 వరకు వసూలు చేస్తున్నాయి. హెలీకాప్టర్‌కు ఎంత వసూలు చేస్తారనేది ఎంపికైన కంపెనీతో చర్చించి నిర్ణయించనున్నారు. ఇదిలా ఉంటే 2027 జూలై నుంచి గోదావరి పుష్కరాలు మొదలుకానున్నాయి. దీనికి లక్షలాది మంది భక్తులు రానున్నారు. ఈలోగా హెలీ టూరిజం ప్రారంభించి ప్రాముఖ్యతను పెంచితే పుష్కరాలకు వచ్చే భక్తులు, పర్యాటకుల నుంచి హెలీ టూరిజానికి మరింత రద్దీ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఎన్ని అందాలో...

గోదావరి.. పాపికొండలు.. ఈ రెండింటి నడుమ ప్రకృతి అందాలు అన్నీ ఇన్నీ కావు. ప్రకృతి ప్రియుల మనసు దోచే సుందర దృశ్యాలెన్నో ఇక్కడ కనువిందు చేస్తాయి. అందుకే అనేక సంస్థలు గోదారి ఒడ్డున ఇసుక తిన్నెల్లో ప్రత్యేక గుడారాలు నిర్మించి మరీ గోదారి అందాలను అనుభవించేలా ప్యాకేజీలు వసూలు చేసి అలరిస్తున్నాయి. ఎండాకాలం, శీతాకాలంలో అయితే గోదావరి అందాలను వర్ణించడానికి మాటలు చాలవు. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు అయితే రాజమహేంద్రవరం నుంచి పాపికొండలకు బోటు షికారు ఎప్పటికీ మర్చిపోలేరు. ఇప్పుడు ఈ అందాలను బోట్ల ద్వారానే కాకుండా ఆకాశ మార్గాన కూడా హెలీకాప్టర్‌లో చూపించేందుకు పర్యాటకశాఖ సిద్ధమవుతోంది. పర్యాటకులను అలరించేందుకు పర్యాటక శాఖ ఈ మార్గంలో హెలీకాప్టర్‌ను నడిపాలని భావిస్తోంది. తద్వారా మరింత మంది టూరిస్టులను ఆకట్టుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.


బార్లకు లాటరీ తీసిన ఆర్డీవో కృష్ణనాయక్

43 దరఖాస్తులు.. 9 బార్లు కేటాయింపు

అరగంటలో ముగిసిన బార్‌ల లాటరీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ కోలాహలంగా జరిగే బార్‌ల కేటాయింపు ఇప్పుడు పేలవంగా జరిగింది. అరగంటలో లాటరీ ప్రక్రియ ముగిసింది. తూర్పుగోదావరి జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 22, కల్లుగీత కార్మికుల కేటగిరీలో నిడదవోలు, రాజమండ్రి, కొవ్వూరు ఒక్కోటి చొప్పున బార్‌లను కేటాయించారు. ఓపెన్‌లో 6 బార్‌లకు 24 దరఖాస్తులు, కల్లుగీత కార్మికుల కేటగిరీకి 19 దరఖాస్తులు వచ్చాయి. బార్‌ల కేటాయింపునకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కృష్ణ నాయక్ లాటరీ తీశారు. కల్లుగీత కార్మికుల కేటగిరీలో రాజమండ్రికి 6, నిడదవోలులోని బార్‌కి 9 దరఖాస్తులు వచ్చాయి. కొవ్వూరు బార్‌కి ఒక్కటే దరఖాస్తు రావడంతో వారినే ఎంపిక చేశారు. కల్లుగీత కార్మికులకు వార్షిక రుసుంలో సగం రాయితీ ఉండడంతో దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ కేటగిరీలో మాత్రం 6 బార్‌లకు నాలుగు చొప్పున 24 దరఖాస్తులు వచ్చాయి. ఇవి కూడా అధికారుల ఒత్తిడితో సమర్పించామని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో ఒకటో తేదీ(రేపటి) నుంచి రాజమండ్రిలో 7, నిడదవోలు, కొవ్వూరులో ఒక్కోటి చొప్పున మొత్తం 9 బార్‌లు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇప్పటి వరకూ 20 వరకూ బార్‌లు ఉన్నాయి. దరఖాస్తులు రాకుండా ఉన్న బార్‌లకు ప్రభుత్వం మళ్లీ దరఖాస్తుకు గడువు ఇచ్చే అవకాశం ఉంది.

స్మార్ట్ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యం.. ఇద్దరిపై చర్యలకు లేఖ

గోపాలపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన స్మార్ట్ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వేళ్లచింతలగూడెం వీఆర్వో కాంతారావును సస్పెన్షన్ చేయాలని కలెక్టర్‌కు సిఫారసు లేఖ పంపినట్టు తహశీల్దార్ సాయిప్రసాద్ శనివారం సాయంత్రం తెలిపారు. స్మార్ట్‌కార్డులు పంపిణీ చేసే ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం వీఆర్వో కాంతారావు, 35 రేషన్ షాపు నిర్వహకుడు గ్రామంలో టాంటాం వేయించినట్టు తెలిపారు. ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాల్సిన స్మార్ట్ కార్డులను ఒక ప్రదేశానికి వచ్చి తీసుకోవాల్సిందిగా కార్డుదారులకు సూచించా రన్నారు. గ్రామంలోకి విచారణకు వెళ్లగా స్మార్ట్‌కార్డులు తీసుకునేందుకు గ్రామానికి చెందిన కొరపాటి వెంకటస్వామి(69) వస్తుండగా మార్గమధ్యలో అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఇంటికి తరలించగా వెంకటస్వామి మృతిచెందినట్టు విచారణలో తేలిందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని భావించి ఇరువురిపై తగు చర్యలకు కలెక్టర్ సిపారసు లేఖ పంపినట్టు చెప్పారు.

ఆర్‌టీఐహెచ్ విభాగాల అధ్యక్షుల ఎంపిక

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ విభాగాల అధ్యక్షుల ఎంపిక ఇంటర్వ్యూ పూర్తిచేసినట్టు ఈఆర్‌టీఐహెచ్ డైరెక్టర్, జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు. బొమ్మూరు ఆర్‌టీఐ హెచ్ భవనంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు జేసీ వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూలను కలెక్టర్ ప్రశాంతి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో ప్యానల్ సభ్యులు జేసీ చిన్నరాముడు, గ్రీన్ కో సీఎస్‌వో పి.రాంబాబు, నన్నయ వర్శిటీ రిజిస్ట్రార్ అండ్ ప్రొఫెసర్ కేవీ స్వామి, కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఏ.గోపాలకృష్ణ, జిల్లా ఇండస్ట్రీస్ అధికారి శ్రీఫణిధర్ రామన్, ఇండస్ట్రియల్ ప్రమోషన్స్ అధికారి టీవి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ సలహాదారు షరీఫ్ రాక

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్ సెప్టెంబరు 1న రాజమహేంద్రవరం పర్యటనకు వస్తున్నారు.ఆదివారం రాత్రి 9 గంటలకు హైదరాబాద్ నుంచి రైలులో బయలుదేరి సోమవారం 1న తెల్లవారుజామున 4:40 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుని అతిథి గృహంలో బస చేస్తారు.ఉదయం 10:15 గంటలకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అప్పర్ ప్రైమరీ మునిసిపల్ స్కూల్ సందర్శిస్తారు. 11:30 గంటలకు కొంతమూరు సమీపంలోజడ్పీ హైస్కూల్ సందర్శిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కలెక్టర్ ప్రశాంతితో సమావేశం అవుతారు.సాయంత్రం 5:30 గంటలకు రోడ్డుమార్గంలో నరసాపురం బయలుదేరి వెళతారు.

కోరుకొండలో యూరియాకు తోపులాట

కోరుకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియాకు రైతులు పోటీపడుతున్నారు. కోరుకొండలో శనివారం మధ్యాహ్నం యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున సొసైటీకి చేరుకుని ఒకరినొకరు తోసుకోవడంతో కోరుకొండ సొసైటీ కార్యాలయం ప్రధాన ముఖ ద్వారం అద్దాలు పగిలిపోయాయి. అద్దాలు గుచ్చుకుని కొంత మంది రైతులు గాయపడ్డారు. 10 గ్రామాల పరిధిలోని 5 వేల మంది రైతులకు కేవలం 10 టన్నుల యూరియా మాత్రమే కేటాయించారు. రైతులు తమకు యూరియా దొరకదేమోన్న ఆత్రుతతో ఒకరినొకరు తోసుకున్నారు. సుమారు 200 మంది రైతులు ఒక్కసారిగా మేడపైకి వెళ్లి బయోమెట్రిక్ వేయాలన్న ఆత్రుతతో తోపులాటకు దిగారు. దీని మూలంగా కార్యాలయ అద్దాలు పగిలిపోయాయి.విషయం తెలుసుకున్న కోరుకొండ పోలీసులు హుటాహుటిన సొసైటీకి చేరుకుని రైతులను అదుపు చేశారు. పగిలిన అద్దాలు పరిశీలించి సొసైటీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సొసైటీ పరిధిలో ఉన్న 10 గ్రామాల్లో సుమారు 5 వేల మంది రైతులు ఉన్నారు. ఒకొక్కరికి రెండు బస్తాలు యూరియా ఇస్తామని.. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని చెప్పారు.అయితే సొసైటీకి వచ్చిన యూరియా 225 బస్తాలు మాత్రమే. 225 బస్తాల యూరియా 5 వేల మంది రైతులకు ఎలా సరిపెట్టాలో తెలియక సొసైటీ సిబ్బంది తలలు పట్టుకున్నారు. ముందుగా వెళ్లిన వారికి యూరియా దొరుకుతుందనే ఆత్రు తతో ఒకరినొకరిని నెట్టికుని ముందుకు వెళ్ళాలని బలప్రయోగానికి దిగారు.




సొసైటీలో రైతుల క్యూ. రైతుల తోపులాటలో బద్దలైన సొసైటీ మెయిన్‌డోర్

16 వేల ఎకరాల్లో నాట్లు

ఈ ఖరీఫ్ సీజన్‌లో కోరుకొండ మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం 35 వేల బస్తాల యూరియా అవసరం ఉంది. కోరుకొండ మండలంలో కోరుకొండ, శ్రీరంగపట్నం, బూరుగుపూడి, దోసకాయలపల్లి, గాడాలలో సొసైటీలకు ఇప్పటి వరకు వచ్చిన ఎరువులు 300 మెట్రిక్ టన్నులు కూడా లేదు. జిల్లా వ్యాప్తంగా లెక్కలు పరిశీలిస్తే యూరియా ఇంచుమించుగా ప్రభుత్వం సరఫరా చేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడ రైతులు యూరియా అందక ఆందోళన చెందుతున్నారు. ఎరువులను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ సక్రమంగా కేటాయింపులు చేయకపోవడం వల్ల ఒక ప్రాంతానికి ఎక్కువ యూరియా వెళ్లిపోవడం, మరో ప్రాంతానికి తక్కువ రావడంతో రైతులు యుద్ధం చేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు . కలెక్టర్, జిల్లా విజిలెన్స్ అధికారులు చొరవ తీసుకుని జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి వాటి పరిధిలో ఎంత మంది రైతులు ఉన్నారో ఎంత వ్యవసాయ భూమి ఉన్నది పరిశీలిస్తే యూరియా ఎలాట్‌మెంట్‌లో తేడాలు బయట పడతాయి. అధిక మొత్తంలో కేటాయించిన యూరియాను బయటకు తీస్తే అందరికీ సక్రమంగా యూరియా అందుతుందని సొసైటీల పాలక వర్గాలు, రైతులు, సీఈవోలు చెబుతున్నారు.

కోరుకొండకు 1285.39 టన్నుల యూరియా ఇచ్చాం..

రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కోరుకొండ సొసైటీకి శుక్రవారం 10.125 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఇప్పటి వరకూ ఆ సొసైటీకి మొత్తం 70.875 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, ఇది గతం కంటే రెట్టింపు అన్నారు గతేడాది 40.500 మెట్రిక్ టన్నుల మాత్రమే ఇచ్చినట్టు చెప్పా రు. ఆదివారం మరో 20 మెట్రిక్ టన్నులు యూరియా పంపిస్తున్నామన్నారు. కోరుకొండ మండలానికి ఇప్పటి వరకూ మొత్తం 1285.39 మెట్రిక్ టన్నులు పంపామని, వాస్తవానికి సెప్టెంబర్ నెల వరకూ 1342 టన్నుల యూరియా అవసరం ఉంటుందన్నారు.యూరియా కొరత అనేది నిజం కాదని ఆయన స్పష్టం చేశారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాక


మాట్లాడుతున్న పిక్కి నాగేంద్ర తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సారథ్యం యాత్రలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సెప్టెంబరు 1వ తేదీ సోమవారం రాజమహేంద్రవరం వస్తున్నారని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి ఉదయం పది గంటలకు యాత్ర ప్రారంభమై దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్యమైదానం వరకూ సాగుతుందని, అనంతరం సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొంటారని తెలిపారు. బీజేపీ ఆంధ్ర రాష్ట్రంలోనూ బలోపేతం కావాలని, దీనికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త దీక్షతో పనిచేయాలన్నారు. సారథ్యం కార్యక్రమాన్ని జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడుకి ప్రత్యేక పూజలు

కొవ్వూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి వాటర్ ట్యాంకు వద్ద రౌండ్ రామాలయం యూత్ ఆధర్యంలో 23 అడుగుల భారీ వినాయకున్ని నెలకొల్పారు. ప్రస్తుతం గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో



కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన భారీ విగ్రహం

వచ్చి దర్శించుకుంటున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే లాంచీలరేవు వద్ద గోల్డెన్ టెంపుల్ ఆకారంలో ఏర్పాటుచేసిన విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో 11 అడుగులతో వినాయకున్ని ఏర్పాటుచేశారు.



తాళ్లపూడి : ప్రక్కిలంకలో వినాయకునికి 108 రకాల ప్రసాదాలను నివేదించిన దృశ్యం

108 రకాల ప్రసాదాల నివేదన

తాళ్లపూడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక కాపులవీధిలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయకునికి శనివారం 108 రకాల ప్రసాదాలను నివేదించారు. అలాగే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ప్రతి ఏడాదిలాగే నవరాత్రులు జరుగుతున్నాయి.

ట్రెజరీ కార్యాలయంలో.. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం

కొవ్వూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ జీఈఏ రాష్ట్ర కార్యవర్గ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగా శనివారం కొవ్వూరు ట్రెజరీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందన్నారు. అలాగే ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ రూపొందించిన ఉద్యోగుల పెండింగ్ బకాయిల సాధన ప్రతిపాదనలను



కార్యాలయంలో సమావేశమైన ఉద్యోగులు

ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో బీ.రఘు, వీ.రాణి, శ్రీనివాసరాజు, దుర్గారావు, కొవ్వూరు తాలూకాలోని ట్రెజరీ, ఆర్‌అండ్‌బీ, మార్కెట్ కమిటీ ఉద్యోగులు, ఏపీజీఈఏ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి / మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస రావు



ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

గోపాలపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస రావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జీ.రాజమహనోహర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 474 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా కాగా, ఇప్పటి వరకు 365 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అలాగే 109 ఇళ్లు పూర్తిచేయాల్సి ఉందన్నారు. ఒకే ఇంటికి రూ. లక్షా 80 వేలు మంజూరు కాగా, కూటమి ప్రభుత్వం వచ్చాక ఎస్సీ, బీసీలకు అదనంగా రూ. 50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు పెంచిందన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 176 మందికి లబ్ధి చేకూరిం దన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఆర్. శివ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పర్యవేక్షకులు బెనర్జీ, తదితరులు ఉన్నారు.

స్వమిత్వ సర్వేను సత్వరమే పూర్తి చేయాలి

సీతానగరం ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను సత్వరమే పూర్తి చేయాలని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి పీ. వీణాదేవి అన్నారు. శనివారం ముగ్గళ్ల, మునికూడలి, రఘుదేవపురం పంచాయతీల్లో చేపడుతున్న సర్వేను డీఎల్‌పీవో నాగలతతో కలిసి పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

- కొవ్వూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కే.నాగలక్ష్మి
- జోగమ్మ వేద సంస్కృత కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

కొవ్వూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలకు చిన్నవయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుందని కొవ్వూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కే.నాగలక్ష్మి అన్నారు. పట్టణంలోని శ్రీవాడ్రేవు జోగమ్మ వేద సంస్కృత కళాశాలలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిషేధ చట్టంపై బాలికలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మెజిస్ట్రేట్ నాగలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లితండ్రులు పెళ్లి వయస్సు రాకుండా ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం వలన భవిష్యత్‌లో ఎన్నో ఆరోగ్య పరమైన సమస్యలను ఎదుర్కొవలసి వస్తుందన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలు చేస్తున్నట్టయితే దగ్గరలోని పోలీసు, మాతా శిశు సంక్షేమాధికారి (ఐసీడీఎస్ పీవో)లకు, మండల న్యాయసేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే బాలికల లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు టిఎస్వీ రమణమూర్తి, బొబ్బా భారతి, రఘురామ్, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ గౌరీ శంకర్, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నాగలక్ష్మి

చాగల్లు: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జీ. సాయికృష్ణ (నిడదవోలు కోర్టు ఇన్‌చార్జి) తెలిపారు. మండల కేంద్రమైన చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగవారికి 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహాలు జరిపించాలన్నారు. ఎస్ఐ కే.నరేంద్ర, నిడదవోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోడి శ్రీనివాసరావు, కే.చిట్టిబాబు, ఎస్వీ సూర్యనారాయణ, ప్రసన్నలక్ష్మి, షేక్‌జమీల, లోక్ అదాలత్ సభ్యులు ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ నరసింహ కిషోర్



పెద్దాపురం శివారు తాడిపూడి కాలువ వద్ద గణేష్ నిమిజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ

గోపాలపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ అన్నారు. పెద్దాపురం గ్రామశివారులో ఉన్న తాడిపూడి కాలువలో జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఎస్పీ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే యువకులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన సమయంలో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. అలాగే కాలువలు, చెరువులు, నదుల్లో విగ్రహాలను నిమజ్జనం చేసే సమయాల్లో పోలీసులు అప్రమత్తమవుతారని, దీంతో ఎటువంటి అవాంఛనీయసంఘటనలకు తావులేకుండా ఉంటుందన్నారు. ఆయన వెంట సీఐ నాయక్, ఎస్సై టి. మనోహర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

లోక శాంతి కోసం లక్ష్మీగణపతి హోమం

నల్లజర్ల, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): అనంతపల్లి సెంటర్‌లో ఉన్న సిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద శనివారం లోక శాంతి కోసం లక్ష్మీగణపతి హోమాన్ని నిర్వహించారు. వేదపండితులు శ్రీనివాస్ బృందం ఆధ్వర్యంలో తొలిత విఘ్నేశ్వర పూజ, పుణ్యహవచనం, రుత్విక్ వరుణ, పూర్ణాహుతి, వేదాశీర్వచనాలతో హోమాన్ని నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం ఊరేగింపు, నిమజ్జనోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది.



అనంతపల్లిలో లక్ష్మీగణపతి హోమం చేస్తున్న దృశ్యం

అమృత్ 2.0 వాటర్ సప్లయి స్కీమ్ స్థల, ప్లాన్ పరిశీలన



నిడదవోలులో ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకరరావు

నిడదవోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అమృత్ 2.0 వాటర్ సప్లయి స్కీమ్ సుమారు రూ. 89.78 కోట్ల వ్యయంతో చేపట్టడం జరుగుతుందని ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.ప్రభాకరరావు అన్నారు. శనివారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో ప్లాన్‌ను పరిశీలించారు. అనంతరం సంత మార్కెట్ వద్ద ఉన్న స్థలాన్ని చూశారు. తర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం అమృత్ 2.0 వాటర్ సప్లయి స్కీమ్ టెండర్ దశలో ఉందని, ఈ ఏడాది డిసెంబరు 25 నాటికి పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉందన్నారు. దీనిపై పట్టణంలో స్థల పరిశీలనకు రావడం జరిగిందన్నారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, అధికారులు ఉన్నారు.

ఛలో విజయవాడను విజయవంతం చేయాలి



నల్లజర్ల హైస్కూల్‌లో పోస్టర్లతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఏపీసీపీఎస్‌ఈ జిల్లా అధ్యక్షుడు జోడాల , తదితరులు

నల్లజర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు ఏపీ సీపీఎస్ ఈఏ జిల్లా ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నల్లజర్ల హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పోస్టర్స్‌తో తమ డిమాండ్‌ను తెలుపుతూ నిరసన తెలిపారు. దీనికి మండలం నుంచి పెద్దఎత్తున ఉద్యోగులు, టీచర్లు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిట్టిబాటు, నాగరాజు, ప్రతాప్, నాగేశ్వర రావు, రాంబాబు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ఈ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ సాధనే ధ్యేయమని, ఆ విధానాన్ని సాధించే వరకు ఉద్యమాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



తాళ్లపాలెంలో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్న డాక్టర్లు

నిడదవోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు అధికంగా కురుస్తున్న తరుణంలో గ్రామాల్లో నిర్వహించే ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.సతీష్ కుమార్ అన్నారు. శనివారం తాళ్లపాలెంలో ప్రథమ చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశావర్కర్ జీ.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రాజమనోహర్‌కు సన్మానం

గోపాలపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణతోనే వ్యక్తిత్వాన్నికి వన్నె వస్తుందని తూర్పుగోదావరి జిల్లా అరుంధతీ ఉద్యోగ, ఉపాధ్యాయ ఫెరడేషన్ నాయకులు కొడమంచిలి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పనిచేస్తున్న గెల్లా రాజమనోహర్‌ను తూర్పుగోదావరి జిల్లా అరుంధతీ ఉద్యోగ, ఉపాధ్యాయ ఫెరడేషన్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగాసత్యనారాయణ మాట్లాడుతూ గోపాలపురం మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించి సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌గా గోపాలపురంలోనే సుదీర్ఘకాలంగా పనిచేసి మండలంలో ప్రజల మన్ననలు పొందారన్నారు. అదే స్ఫూర్తితో మండల అభివృద్ధి అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. విధి నిర్వహణలో నిబదత, నిజాయితీయే రాజమనోహర్ ఈ స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మధు, శేఖర్, చాపల శ్రీనివాస్, తాతారావు, మోహన్,బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోను సన్మానిస్తున్న దృశ్యం

దాతల సహకారంతో పాఠశాలలు మరింత అభివృద్ధి



దాత నాగమణిను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

చాగల్లు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఊనగట్ల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీ రమణయ్య అన్నారు. శనివారం స్కూల్లో సైకిల్ షెడ్డు నిర్మాణానికి రూ. లక్షా 37 వేలు విరాళం అందజేసిన దాత ఉప్పలపాటి నాగమణి, పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్. వీరవెంకట సత్య భాస్కరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, పాఠశాల టీడీపీ నాయకులు నందిగం శ్రీనివాసరావు (దత్తుడు), బొల్లిన అప్పారావు, గాయత్రి, వేములపల్లి శేషారత్నం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం / దేవరపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్ హేమస్మిత

దేవరపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని దేవరపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత పేర్కొన్నారు. దేవరపల్లిలో జాతీయ క్రీడాదినోత్సవంలో భాగంగా శనివారం అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్‌లో రాజమహేంద్రవరం పొగాకు రీజనల్ పరిధిలోని దేవరపల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డి గూడెం పొగాకు బోర్డులోని ఉద్యోగులు పాల్గొన్నారు. ఏఎస్‌వో మాట్లాడుతూ ఉద్యోగాల నిర్వహణలో ఎప్పుడూ బిజీగా ఉంటారన్నారు. అందుకే కుర్చీలాట, చెస్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో గోపాలపురం వేలం నిర్వహణాధికారి కే.రామ్ మీనా, జంగారెడ్డిగూడెం ఏఎస్ చైప్రశాంత్, జంగారెడ్డిగూడెం - 2 సురేంద్ర, ఐదు బోర్డుల్లోని అధికారులు, క్రీడలకు సహకరించిన పీఈటీ ఓరుగంటి నాగరాజు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని.. బీరు బాటిల్‌తో కొడుకు దాడి

నల్లజర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బ్రాందీ షాపు వద్ద కొడుకు మద్యం సేవిస్తుండగా.. ఇంతలో అతని తండ్రి మద్యం కోసం అదే షాపునకు వచ్చాడు. కాగా, స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్న కొడుకును చూసి తండ్రి మందలించడంతో ఆగ్రహించిన కొడుకు బీరు బాటిల్‌తో మెడమీద పొడిచాడు. ఈ సంఘటన శనివారం రాత్రి అనంతపల్లి బ్రాందీ షాపు వద్ద చోటుచేసుకుంది. స్థానిక శ్రీనివాస్ నగర్ కాలనీలో ఇటుకల వ్యాపారం చేస్తున్న కాకి సుబ్బారావు, అతడి కుమారుడు గణపతి నివాసముంటున్నారు. వీరిద్దరి మధ్య మద్యం గొడవ పెట్టింది. తీవ్రంగా గాయపడ్డ సుబ్బారావును రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఇంటింటా చెత్త సేకరణ జరగాలి



పాలంగిలో చెత్తసేకరణ తీరును అడిగి తెలుసుకుంటున్న అధికారులు

ఉండ్రాజవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణ తప్పనిసరిగా చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎం. సందీప్ పేర్కొన్నారు. శనివారం పాలంగిలో ఇంటింటా చేపడుతున్న చెత్త సేకరణను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నుంచి తడిచెత్త పొడిచెత్త వేర్వేరుగా సేకరించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే తడి చెత్తతో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల వద్ద వర్మీకంపోస్టు తయారు చేయాలని చెప్పారు. ఇంటింటి చెత్త సేకరణ ఎలా జరుగుతుందని గృహయజమానులను ప్రత్యేక అధికారి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డీ హసన్‌జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ విజేతకు సత్కారం



భవానిని సత్కరిస్తున్న దృశ్యం

పెరవలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని గ్రంథాలయంలో గల పుస్తకాలు, పత్రికలు చదవడం ద్వారా ఉపాధ్యాయ పరీక్షలో ఆమె విజయం సాధించింది. వివరాలివి.. ముక్కామలకు చెందిన కట్టా భవాని డీఎస్సీ పరీక్ష రాయడానికి ఎలాంటి కోచింగ్‌కూ వెళ్లలేదు. తమ గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో ప్రతి రోజూ సుమారు 12 గంటల పాటు వివిధ పత్రికలు, పుస్తకాలు చదివింది. అవసరమైతే గ్రంథాలయం నుంచి కొన్ని పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి రాత్రి సమయంలో కూడా కష్టపడింది. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 28వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆమెను ఆ గ్రామానికి చెందిన పలువురు శనివారం అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్య క్షుడు కడియాల సాయి రామారావు, గ్రామ ప్రముఖులు ఎస్‌వీ సూర్యనారాయణ, గ్రంథాలయ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉద్యోగస్తులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో ఎస్పీ పర్యటన

తాళ్లపూడి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణపతి విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ డీ.నరసింహ కిషోర్ అన్నారు. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో శనివారం రాత్రి గణపతి నవరాత్రి మండపాలను ఎస్పీ పరిశీలించారు. కమిటీ సభ్యులతో మాట్లాడుతూ పోలీసులు సూచించిన ప్రదేశాలలో మాత్రమే వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయాలన్నారు. ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోరాదన్నారు. నిమజ్జన ఊరేగింపులలో డిజేలకు అనుమతిలేదన్నారు. అనంతరం మండలంలోని గోదావరి రేవులను పరిశీలించారు.



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిషోర్

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్‌గా ఉదయ భాస్కరరావు



సీఎంతో ఉన్న ఉదయ భాస్కరరావు

నల్లజర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దూబచర్లకి చెందిన టీడీపీ సీనియర్ నేత, జిల్లా కార్యదర్శి కూచిపూడి ఉదయ భాస్కరరావుకు రాష్ట్ర పదవి దక్కింది. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్‌గా నియమించినట్టు శనివారం రాత్రి ప్రభుత్వం ప్రకటించింది. పదవి రావడంపై మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన సేవలను గుర్తించి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సిఫార్సు చేయడంతో పదవి దగ్గడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగలకు అన్యాయం జరగకుండా చూడాలి

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు
- దుద్దుకూరు ఫంక్షన్ హాలులో ఎంఆర్‌పీఎస్ నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

దేవరపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు అన్యాయం జరగకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుని అసెంబ్లీలో చట్టం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం దుద్దుకూరు ఫంక్షన్ హాలులో ఎంఆర్‌పీఎస్ నాయకుల సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షుడిగా రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ అధికార ప్రతినిధి కొడవటి బుజ్జిబాబు అధ్యక్షత వహించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రిజర్వేషన్ ఫలాలు అందుకోలేక చట్టసభలు, విద్యలోనూ మాల, మాదిగ ఉప కులాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణకు ఆయన సానుకూలంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు వనం నాగేశ్వరరావు, సీహెచ్ సృజనారావు, చిర్రా రాజు, బొబ్బిలి వెంకట్రాజు, ప్రత్తిపాటి రాంబాబు, బల్లంకుల రాజు, మట్టా వరసాయిప్రసాద్, యండ్రపాటి ఇజ్రాయిల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గోదారిలో నది స్నానాలు, చేపల వేట నిషేధం

కొవ్వూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో వరద ఉధృతి పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని అఖండ గోదావరి కుడి గట్టు ఏఈ జీ. మణికంఠరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం వద్ద వరద మరింత పెరగడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. అలాగే కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద ఎవరూ దిగకుండా తాడుతో బారికేడ్లు, నదీ స్నానాలు, చేపల వేటను నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, గోష్పాద క్షేత్రంలో పోలీసు, ఫైర్, మున్సిపాల్టీ సిబ్బందిని నియమించామన్నారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు.



గోష్పాదక్షేత్రం వద్ద వరదను పరిశీలిస్తున్న అధికారులు